# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 336, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం - 17 - ఫిబ్రవరి - 2025




## నటి కృష్ణవేణి మృతి బాధాకరం: చంద్రబాబు

- ఎన్టీఆర్ ను వెండితెరకు పరిచయం చేసి కృష్ణవేణి ప్రత్యేక గుర్తింపు పొందారు: పవన్ కల్యాణ్
- పాత తరం నటి, నిర్మాత కృష్ణవేణి కన్నుమూత
- తెలుగు సినీ చరిత్రలో కృష్ణవేణిది ఓ ప్రత్యేక అధ్యాయం: బాలకృష్ణ
- నటి కృష్ణవేణి మృతి వ్యక్తిగతంగా తమకు తీరని లోటని వ్యాఖ్య
- ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి
- కృష్ణవేణి కుటుంబానికి సానుభూతి తెలియజేసిన బాలకృష్ణ

# ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలు...

## నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

ఫిబ్రవరి 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు

నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి ఏపీలో త్వరలో తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి... ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుండగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో, సీఎం చంద్రబాబు ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా




మిగతా..2లో

## కులగణన, ఎస్సీ వర్గీకరణలో

# తెలంగాణ ఒక రోల్ మోడల్

- ఉప ఎన్నికలు ఎలా వస్తాయో కేటీఆర్ చెప్పాలి : సీఎం రేవంత్ రెడ్డి
- ఇంకా పలు కీలక అంశాలపై రేవంత్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.
- ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు
- ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు అందజేయాలో ఆలోచన చేస్తాం'



హైదరాబాద్ : : తెలంగాణలో త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి.. బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఇటీవల కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కామెంట్స్‌పై సీఎం రేవంత్ ఢిల్లీలో స్పందించారు. ఉప ఎన్నికలు ఎలా వస్తాయో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు కీలక అంశాలపై రేవంత్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఉప ఎన్నికలు ఎలా వస్తాయో కేటీఆర్ చెప్పాలని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కోర్టులు చేసే పని కేటీఆర్ చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్పందించారు. రాజ్యాంగంలో ఉన్నదే కోర్టులు అనుసరిస్తాయని.. గతంలో సబిత, తలసాని ఏ పార్టీ బీఫామ్‌పై గెలిచారని ప్రశ్నించారు. ఎవరి హయాంలో మంత్రులు అయ్యారో కేటీఆర్ చెప్పాలమి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సంక్షేమానికి బాటలు.. కులగణనపైనా సీఎం స్పందించారు. 'కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్. కులగణన ద్వారా ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్నాం. రాహుల్ గాంధీ చెప్పింది నేను కచ్చితంగా చేస్తా. రాష్ట్రంలో కులగణన సమగ్రంగా నిర్వహించాం. ఇందులో వెల్లడైన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కమిషన్ లేదా కమిటీ వేస్తాం. ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు అందజేయాలో ఆలోచన చేస్తాం' అని ముఖ్యమంత్రి వివరించారు. వ్యక్తిగతంగా మాట్లాడలేదు.. 'ప్రధాని మోదీ గురించి నేను మిగతా..2లో

## కాంగ్రెస్ సర్కార్‌పై

# బీజేపీ, బీఆర్ఎస్ ఫైర్..

## కులగణన రీ సర్వే షురూ..



బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు..

తెలంగాణ: తెలంగాణలో రీసర్వే మొదలైంది. ఈనెల 28 వరకు కులగణనలో నమోదు చేసేందుకు ప్రజలకు అవకాశం కల్పించింది తెలంగాణ ప్రభుత్వం. ప్రజలు మూడంచెల విధానంలో రెండోసారి సర్వే చేస్తోంది సర్కార్. మరోవైపు రీసర్వేపైనా మిగతా..2లో

## ఐపీఎల్ 2025 షెడ్యూల్ విడుదల..










## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై కీలక ప్రకటన చేయనున్న ఏపీ ప్రభుత్వం

త్వరలోనే ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ సమావేశాల్లో సచివాలయ ఉద్యోగులపై ప్రకటన చేసే అవకాశం రేపు సచివాలయ ఉద్యోగుల సంఘాలతో మంత్రి బాలవీరాంజనేయస్వామి సమావేశం 2

## 42 మంది కార్మికులను చిదిమేసిన బంగారు గని



ఆఫ్రికా దేశం మాలిలో దుర్ఘటన

ఒక్కసారిగా విరిగిపడిన కొండచరియలు

తప్పించుకునేలోపే మృత్యువాత పడిన కార్మికులు

## ఐఏఎస్, ఐపీఎస్‌లపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



- ఆరు దశాబ్దాల జ్ఞాపకాలను పుస్తక రూపంలో తీసుకుని రావడం బిగ్ టాస్క్
- కొత్తగా ఐఏఎస్‌గా వచ్చే వాళ్లకు గోపాలకృష్ణ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది

# మనం నాటిన విత్తనం.. నేడు మర్రి చెట్టుగా మారుతోంది



- ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా మనం ఉన్నాం
- మన వస్త్ర ఎగుమతులు రూ.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి
- ఇప్పుడు లక్ష్యం 2030 నాటికి దీనిని రూ. 9 లక్షల కోట్లకు తీసుకెళ్లడమేనని స్పష్టం
- 'భారత్ టెక్స్ 2025' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ఢిల్లీ: ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'భారత్ టెక్స్ 2025' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా మనం ఉన్నామని తెలిపారు. మన వస్త్ర ఎగుమతులు రూ.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇప్పుడు లక్ష్యం 2030 నాటికి దీనిని రూ. 9 లక్షల కోట్లకు తీసుకెళ్లడమేనని స్పష్టం చేశారు. భారతదేశం ప్రపంచంలో ఆరవ అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 2030 నాటికి రూ.9 లక్షల కోట్లకు పెంచడమే



## బీజేపీ కీలక నేతలతో భేటీ

- ఢిల్లీ కొత్త సీఎం ఖరారు నేడే..!
- రేసులో ముందున్న యువనేత
- ఢిల్లీ సీఎంగా ఎవరిని నిర్ణయించాలన్నదానిపై బీజేపీ హైకమాండ్ ఇప్పటికే చర్చోపచర్చలు




## 42 మంది కార్మికులను చిదిమేసిన బంగారు గని

ఆఫ్రికా: ఓ బంగారు గని కుప్పకూలిన ఘటన ఆఫ్రికా దేశం మాలిలో చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 42 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మాలి దేశంలోని తూర్పు ప్రాంతంలో ఉన్న ఈ గని కొందరు చైనా జాతీయులు నిర్వహణలో ఉంది. ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడడంతో కార్మికులు తప్పించుకోలేకపోయారు. కొన్ని రోజుల వ్యవధిలోనే మాలి దేశంలో జరిగిన రెండో ప్రమాదం ఇది. గత నెల 29న కౌలికోరో ప్రాంతంలో ఉన్న ఓ బంగారు గని కూలిపోయిన ఘటనలోనూ ప్రాణనష్టం జరిగింది. మాలి దేశం ఆఫ్రికాలోని మూడో అతి పెద్ద బంగారం ఉత్పత్తిదారుగా ఉంది. ఇక్కడి జనాభాలో 10 శాతం కంటే ఎక్కువమంది గనులపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారు. గతేడాది కూడా మాలిలో ఓ బంగారు గని కుప్పకూలి 70 మంది మృత్యువాతపడ్డారు. ఇక్కడి గనుల్లో చాలా వరకు అనుమతులు లేనివే ఉంటాయని తెలుస్తోంది.

# ఐపీఎల్ 2025 షెడ్యూల్ విడుదల..

### తొలి మ్యాచ్‌లో కేకేఆర్‌ను ఢీకొట్టనున్న ఆర్సీబీ

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 షెడ్యూల్ ఇవాళ (ఫిబ్రవరి 16) విడుదలైంది. ఈ సీజన్ తొలి మ్యాచ్ మార్చి 22న జరుగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ .. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ కేకేఆర్ హోం గ్రౌండ్ అయిన ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. ఇదే ఈడెన్ గార్డెన్స్‌లో క్వాలిఫయర్-2 (మే 23) మరియు ఫైనల్ మ్యాచ్‌లు (మే 25) జరుగనున్నాయి. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో క్వాలిఫయర్-1 (మే 20) మరియు ఎలిమినేటర్ (మే 21) మ్యాచ్‌లు జరుగుతాయి. గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్.. మార్చి 23న జరిగే తమ తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌ను ఎస్ఆర్‌హెచ్ తమ సొంత మైదానమైన ఉప్పల్ స్టేడియంలో ఆడుతుంది. అదే రోజు చెన్నై వేదికగా ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ జరుగుతుంది. మొత్తం 65 రోజుల పాటు జరిగే ఐపీఎల్-2025 సీజన్‌లో 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. దేశవ్యాప్తంగా 13 వేదికల్లో మెగా లీగ్ నిర్వహించబడుతుంది.

## ఐఏఎస్, ఐపీఎస్‌లపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ కర్మయోగి' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల జ్ఞాపకాలను పుస్తక రూపంలో తీసుకుని రావడం బిగ్ టాస్క్ అన్నారు. కొత్తగా ఐఏఎస్‌గా వచ్చే వాళ్లకు గోపాలకృష్ణ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చాలా మందికి కొంత మంది సీనియర్ ఐఏఎస్‌ల గురించి ఇప్పటికి తెలీదు.. శేషన్ ఐఏఎస్.. ఎన్నికల కమిషన్ ఉందని తట్టి లేపిన గొప్ప వ్యక్తి. రాజకీయ నాయకులను గైడ్ చేసే విధానం అప్పట్లో ఉండేది. ఇప్పుడు ఎందుకు అలా లేదో తెలియడం లేదు. రాజకీయ నాయకులకు అవగాహన కల్పించే సెక్రటేరియట్ రూల్స్ ఉన్నాయి. కొత్తగా సెలెక్ట్ అయిన కొందరు ఐపీఎస్‌లు తప్పుడు మార్గంలో నడుస్తున్నారు." అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "కొత్త ఐపీఎస్‌లు యూనిఫామ్ వేసుకొని సివిల్ పంచాయితీలు చూసుకోవడం దురదృష్టకరం. ఏసీ రూమ్ నుంచి బయటికి రావడానికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇష్ట పడటం లేదు. జనంలోకి రండి అంటే రావడం లేదు. అధికారుల ఆలోచన విధానంంలో మార్పు రావాలి. నిబద్ధత ఉన్న ఆఫీసర్లు ఎక్కడ ఉన్నా పోస్టింగ్‌లు వస్తాయి" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## బీజేపీ కీలక నేతలో భేటీ

### ●ఢిల్లీ కొత్త సీఎం ఖరారు నేడే..!

న్యూఢిల్లీ:ఢిల్లీ కొత్త సీఎం ఎవరన్నదానిపై సస్పెన్స్‌కు తెరపడనుంది. సీఎం పేరును సోమవారం(ఫిబ్రవరి17) జరిగే బీజేపీ కీలక నేతలో భేటీలో ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎంగా ఎవరిని నిర్ణయించాలన్నదానిపై బీజేపీ హైకమాండ్ ఇప్పటికే చర్చోపచర్చలు సాగిస్తోంది. దీనిపై పార్టీ ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే సీఎం ఎవరన్నది బయటికి పొక్కకుండా బీజేపీ నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఈ విషయంపై ఎవరూ నోరు విప్పకుండా అధిష్టానం స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌పై విజయం సాధించిన పర్వేష్‌వర్మకే ఢిల్లీ సీఎంగా ఎక్కువ అవకాశాలున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పర్వేష్‌వర్మతో పాటు ఢిల్లీ మాజీ ప్రతిపక్షనేత విజేందర్‌గుప్తా, ఢిల్లీ బీజేపీ మాజీ చీఫ్ సతీష్ ఉపాధ్యాయ,ఢిల్లీ బీజేపీ జనరల్ సెక్రటరీ ఆశిష్ సూద్,ఆర్ఎస్ఎస్ నేత జితేంద్ర మహాజన్ పేర్లు సీఎం రేసులో పరిశీలనలో ఉన్నాయి. కాగా, ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీపార్టీపై బీజేపీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ అధికారం చేపట్టనుంది.

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై కీలక ప్రకటన చేయనున్న ఏపీ ప్రభుత్వం

అమరావతి: ఏపీలో గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను, వాలంటీర్ల నియామకాలు జరిపిన సంగతి తెలిసిందే. ఎన్నికల ముందు వాలంటీర్లు పెద్ద సంఖ్యలో రాజీనామాలు చేయడంతో, ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వంలోని ఇతర శాఖల్లోకి తీసుకోవాలన్న ప్రతిపాదన ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక... మూడు కేటగిరీల కింద సచివాలయాలకు కేటాయించిన ఉద్యోగులు పోను, ఇంకా 40 వేల మంది ఉద్యోగులు మిగిలినట్టు తెలుస్తోంది. వారిని వివిధ ప్రభుత్వ శాఖల్లోకి తీసుకునేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. త్వరలోనే ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనుండగా... ఈ సమావేశాల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం కీలక ప్రకటన చేయనుంది. ఈ నేపథ్యంలో, రేపు (ఫిబ్రవరి 17) మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘాలతో సమావేశం కానున్నారు. ఆయా సంఘాల నుంచి వినతులు, సూచనలు స్వీకరించనున్నారు. దీనిపై నివేదిక రూపొందించనున్నారు. ఈ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో ప్రకటన ఉంటుంది.

# మనం నాటిన విత్తనం.. నేడు మర్రి చెట్టుగా మారుతోంది

మా దృష్టి సాంకేతిక వస్త్ర రంగంపై ఉందన్న ప్రధాని, ఈ రంగంలో భారతదేశం తన ఉనికిని చాటుకుంటోందని అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం(ఫిబ్రవరి) న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన భారత్ టెక్స్ 2025 కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ మండపంలో మనం నాటిన విత్తనం ఇప్పుడు మర్రి చెట్టుగా మారే మార్గంలో ఉందని అన్నారు. భారత్ టెక్స్ ఇప్పుడు ఒక మెగా గ్లోబల్ టెక్స్‌టైల్ ఈవెంట్‌గా మారిందన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ నాయకులు భాగస్వామ్యం చేసుకోవడానికి, సహకరించుకోవడానికి ఒక వేదికను అందిస్తుంది. ఇక్కడికి వచ్చే ప్రతి వ్యక్తికి స్థానికం నుండి ప్రపంచానికి వెళ్ళే అవకాశం లభిస్తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారత్ టెక్స్‌టైల్ రంగం ఒక ప్రధాన ప్రపంచ కార్యక్రమంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. 120 కి పైగా దేశాలు ఇందులో పాల్గొంటున్నాయని ప్రధానమంత్రి తెలిపారు. కేవలం రూ.75 కోట్ల పెట్టుబడితో 2,000 మందికి ఉపాధి లభించే అవకాశం ఉన్నందున, బ్యాంకింగ్ రంగం వస్త్ర పరిశ్రమకు మద్దతు అందించాలని ఆయన కోరారు. గత సంవత్సరం భారతదేశ వస్త్ర, దుస్తుల ఎగుమతులు ఏడు శాతం వృద్ధిని నమోదు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం, భారతదేశం ప్రపంచంలో ఆరవ అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉంది. 2030 నాటికి ప్రస్తుత రూ.3 లక్షల కోట్ల నుండి రూ.9 లక్షల కోట్లకు పెంచడమే మా లక్ష్యం. మా దృష్టి సాంకేతిక వస్త్ర రంగంపై ఉందని, ఈ రంగంలో భారతదేశం తన ఉనికిని చాటుకుంటోందని ఆయన అన్నారు. భారతదేశం అధిక-గ్రేడ్ కార్బన్ ఫైబర్ తయారీ వైపు పయనిస్తోందని, వస్త్ర రంగానికి నైపుణ్యం కలిగిన ప్రతిభావంతుల సమూహాన్ని సృష్టించడానికి కృషి చేస్తోందని ప్రధాన మంత్రి తెలియజేశారు. గత సంవత్సరం భారత్ టాక్స్‌లో చేరిన తర్వాత, కొత్త కొనుగోలుదారులు పెద్ద ఎత్తున దొరికారని, వ్యాపారం విస్తరించిందని కొంతమంది చెప్పారని ఆయన అన్నారు. డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. మేము దానిని తీర్చలేకపోతున్నామన్న ప్రధాని, బ్యాంకింగ్ రంగ సంస్థలు వస్త్ర రంగంలో పెట్టుబడి, ఇతర అంశాలను ప్రోత్సహించాలని సూచించారు. భారత్ టెక్స్ కార్యక్రమంలోని దుస్తుల ద్వారా కూడా సాంస్కృతిక వైవిధ్యం కనిపిస్తుందని ఆయన అన్నారు. ఇదే సరైన సమయంబీ మన వైవిధ్యం, ప్రత్యేకత ఇటువంటి కార్యక్రమాల ద్వారా వస్త్ర పరిశ్రమను విస్తరించడానికి ఒక మాధ్యమంగా మారాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

# ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలు...

మొదటి పేజి తరువాయి



చంద్రబాబు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఎన్నిక మనకు పరీక్ష వంటిదే... అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధించాలి అని స్పష్టం చేశారు. నేతలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుని ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి 93 శాతం స్ట్రయిక్ రేట్ తో విజయం అందించారని... ప్రజల నమ్మకం నిలబెట్టుకునేందుకు నిత్యం పనిచేస్తున్నామని అన్నారు. వ్యవస్థలను చక్కదిద్ది, పాలనలో స్పష్టమైన మార్పు తెచ్చామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీల మేరకు యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నామని, త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను చెల్లించామని చంద్రబాబు వెల్లడించారు.

# మోదీ- ట్రంప్ చర్చలు ఐదు కీలక అంశాలు ఇవే...

ఢిల్లీ: డోనల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా వెళ్లొచ్చారు. ఈ పర్యటన హుందాగా, ఒక వాణిజ్య వ్యవహారంగా, ఎలాంటి ప్రత్యేకతలు లేకుండా సాగింది. 2025లో వాణిజ్య లోటును తగ్గించేందుకు భారత్‌కు ఆయుధాల అమ్మకాలు పెంచాలని, అందులో భాగంగాఎఫ్ 35 జెట్ విమానాలతో పాటు ముడి చమురు, సహజవాయువు ఎగుమతులు పెంచాలను కుంటున్నట్లు ట్రంప్ ప్రకటించారు. రక్షణ రంగానికి సంబంధించి వాణిజ్య ఒప్పందంపై చర్చలు, దాన్ని ఖరారు చేసేందుకు రెండు పక్షాలు అంగీకరించాయి. 2008 ముంబయి దాడుల సూత్రధారుల్లో ఒకరు, షికాగోకు చెందిన వ్యాపారి తహ్వూర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అంగీకరిస్తున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. "నెల రోజుల వ్యవధిలోపే ఒక ప్రభుత్వం ఇన్ని పనులు చెయ్యడం చాలా గొప్ప విషయమే" అని వాషింగ్టన్‌లోని సౌత్ ఏషియా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మైఖేల్ కుగెల్‌మన్ బీబీసీతో చెప్పారు. "మొత్తంగా చూస్తే బైడెన్ పాలనా కాలంలో జరిగిన ఒప్పందాలు, ప్రత్యేకించి టెక్నాలజీ, రక్షణ రంగంలో జరిగినవి, ట్రంప్ హయాంలో కొన్ని మార్పులు చేర్పులు చేసినా, వాటిని కొనసాగించేందుకు రెండు పక్షాలకు పెద్దగా ఇబ్బందులు లేవని అనుకోవచ్చు" అన్నారాయన.

అయినప్పటికీ, పెద్ద సవాళ్లు ముందున్నాయి. అవేంటో చూద్దాం.

అమెరికా తన వాణిజ్య భాగస్వామ్య దేశాలపై పన్నుల భారం మోపుతోంది. దీంతో ఆయా దేశాలు కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ప్రతీకారం అన్నట్లుగా పన్నులు విధిస్తున్నాయి. ఇలాంటి సమయంలోనే మోదీ అమెరికా పర్యటనకు వెళ్లారు. అమెరికా వాణిజ్య భాగస్వాముల మీద విస్తృతంగా పన్నులు విధించే ప్రణాళిక రూపొందించాలని ట్రంప్ సలహాదారులను ఆదేశించారు. అవి ఏప్రిల్ 1నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. అమెరికాకు కీలక వాణిజ్య భాగస్వామి అయిన భారత్ మీద అమెరికా పెద్దగా భారం మోపడం లేదు. ట్రంప్ పన్ను ఎత్తుగడలను ఎదుర్కొనేందుకు వీలుగా భారత్ తన బడ్జెట్‌లో అనేక వస్తువుల మీద పన్నులను 13 శాతం నుంచి 11 శాతానికి తగ్గించింది. భారతదేశం ప్రస్తుతానికి పన్నుల ప్రమాదాన్ని తప్పించుకున్నట్లుగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పన్నులతో సమస్య ఉన్నట్లు కనిపించడం లేదని ఢిల్లీ కేంద్రంగా పని చేసే గ్లోబల్ ట్రేడ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. దీనికి ప్రధాన కారణం అమెరికా భారత్‌కు ఎగుమతి చేసే 75శాతం వస్తువుల్లో దిగుమతి సుంకాలు కట్టాల్సినవి 5 శాతం కంటే తక్కువగా ఉంటాయని ఆయన చెప్పారు. "ఒకే సమూహంలో కొన్ని ఎంపిక చేసిన వస్తువుల మీద 150 శాతం పన్నులు

"ఒకే సమూహంలో కొన్ని ఎంపిక చేసిన వస్తువుల మీద 150 శాతం పన్నులు విధించడాన్ని ట్రంప్ ప్రస్తావించారు. అయితే అది సబబు కాదు. ప్రతీకార పన్నుల విషయంలో భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం పెద్దగా కనిపించడం లేదు" అని శ్రీవాస్తవ బీబీసీతో చెప్పారు. అయితే ఈ అభిప్రాయంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌లో సెంటర్ ఫర్ డబ్ల్యూటీవో స్టడీస్ మాజీ అధిపతి అభిజిత్ దాస్ ఏకీభవించడం లేదు.

"ఇది బయటకు తేలిగ్గా కనిపించవచ్చు. కానీ ఇందులో కనిపించని సమస్యలు ఉన్నాయి. భారత దేశం దిగుమతి సుంకాలకు ప్రతీకార పన్నులకు సంబంధం ఉండదు. వేరే అంశాలు కూడా వాటిని ప్రభావితం చెయ్యవచ్చు" అని ఆయన బీబీసీతో చెప్పారు. ట్రంప్ ప్రతీకార పన్నుల వ్యవహారం కేవలం దిగుమతి సుంకాలకే పరిమితం అవుతుందని భావించలేం. విలువ ఆధారిపత పన్ను, పన్నేతర ఆటంకాలు, వాణిజ్యపరమైన ఆంక్షల్ని కూడా ఆయన వాడవచ్చు.



భారతదేశంలోకి దిగుమతి అయ్యే వస్తువుల మీద ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం జీఎస్టీ విధిస్తున్నారు. ట్రంప్ భారత్ మీద ప్రతీకార పన్నులు విధించాలనుకుంటే దీన్ని ఆయుధంగా వాడుకునే అవకాశం ఉంది. ప్రతీకార పన్నుల విషయంలో అమెరికన్ ప్రభుత్వం విడుదల చేసిన మెమో ఈ వ్యూహాన్ని వివరిస్తుంది. ప్రతీకార పన్నుల్ని విధించే విషయంలో అమెరికన్ వ్యాపార సంస్థల మీద పన్నేతర ఖర్చుల భారం, విదేశీ సంస్థలకు ఇచ్చే రాయితీలు, విదేశాల్లో అమెరికన్ వస్తువులపై భారాన్ని మోపే నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని అమెరికన్ ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నిబంధనల రక్షణలో ఉన్న ఇండియన్ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లోకి తమకు అనుమతి ఇవ్వాలని అమెరికా ఆశిస్తుందని దాస్ చెప్పారు. "ఇది దేశీయ ఉత్పత్తిదారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న భారత ప్రభుత్వ విధానానికి ఆటంకంగా మారుతుంది. మేకిన్ ఇండియా అనే ప్రభుత్వ విధానానికి నేరుగా సవాలు విసురుతుంది. ఇది మనకు ఎంత మాత్రం మంచిది కాదు" అని ఆయన అన్నారు. ట్రంప్ ప్రతీకార పన్నుల వ్యూహాన్ని భారత్ తిప్పి కొట్టాలని దాస్ సూచిస్తున్నారు. ముఖ్యంగా, భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల్లో విష రసాయనాలు ఉన్నాయంటూ అమెరికా వాటి మీద పన్నేతర ఆంక్షలు విధిస్తోంది. అమెరికా తమ దేశంలో వ్యవసాయ రంగానికి భారీగా రాయితీలు ఇస్తుందని ఆయన చెబుతున్నారు. అమెరికా వాదనను తిప్పి కొట్టేందుకు భారత్ ఈ రాయితీల వ్యవహారాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని దాస్ సూచిస్తున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్య లోటును భర్తీ చేసేందుకు కేవలం పన్నులు ఒక్కటే సమాధానం కాదు. రక్షణ, ఇంధన రంగంలో కొనుగోళ్లు కొంత వరకు లోటును భర్తీ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. అమెరికా నుంచి భారత్ మరిన్ని ఆయుధాలు కొనుగోలు చేయాలని ట్రంప్ ఆశిస్తున్నారు.

రెండు దేశాల మధ్య వాణిజ్యం 2030 నాటికి రెట్టింపు కావాలని, అది కూడా ప్రస్తుతం ఉన్న 190 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్ అమెరికా లక్ష్యంగా నిర్ణయించుకున్నాయి. 2025 జూన్- జులైలో వాణిజ్య ఒప్పందం తొలి దశపై చర్చించాలని మోదీ, ట్రంప్ భావిస్తున్నారు. ఈ చర్చలు మార్కెట్లను అందుబాటులో ఉంచడం, పన్నుల తగ్గింపు, వస్తువులు, సేవల రంగాల్లో సరఫరా వ్యవస్థల ఏకీకరణపై చర్చలు జరగనున్నాయి. "రెండు దేశాలు వాణిజ్య ఒప్పందాన్ని కొనసాగిస్తాయనే ప్రకటన, పన్నుల తగ్గింపు కోసం చర్చలు జరపడానికి భారతదేశానికి అవకాశం ఇస్తుంది. అది అమెరికా-భారతదేశం సంబంధానికి మాత్రమే కాకుండా, ఇటీవలి నెలల్లో గందరగోళంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థకు కూడా వరంలా మారుతుంది " అని కుగెల్‌మన్ అన్నారు. అయితే రెండు దేశాలు ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకుంటాయన్న దానిపై స్పష్టత లేదు.

"ఈ వాణిజ్య ఒప్పందం ఏమిటి? ఇది పూర్తి స్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమా లేదా పరస్పర సుంకాల ఒప్పందమా?" అని శ్రీవాస్తవ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందంపై వివరాలు తెలియకుండా వ్యాఖ్యానించడం సరికాదని దాస్ అభిప్రాయపడ్డారు. "ఇది తప్పనిసరిగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కాకపోవచ్చు. అదే అయితే దాని గురించి స్పష్టంగా చెప్పి ఉండేవారు. ఇది కొన్ని ఎంపిక చేసిన వస్తువుల మీద పన్నులను తగ్గించేలా ఇందులో రెండు దేశాలకు ప్రయోజనం ఉండేలా కూడా ఉండవచ్చు" అని దాస్ చెప్పారు. సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థ ఆసియా డీకోడెడ్‌లో ప్రధాన ఆర్థికవేత్త ప్రియాంక కిశోర్ మాట్లాడుతూ, 500 బిలియన్ల డాలర్లు "చాలా పెద్ద లక్ష్యమే కానీ ఇందులో మనకు లాభం చేకూర్చే అంశాలు తక్కువగా ఉన్నాయి" అని చెప్పారు. "ఉదాహరణకు, రష్యన్ షాడో ఫ్లీట్‌పై అమెరికా ఆంక్షలు త్వరలో అమలులోకి రానున్నాయి, కాబట్టి భారతదేశం చమురు కోసం అమెరికా వైపు మొగ్గు చూపుతుంది. ఇది అంత కష్టం కాదు" అని ప్రియాంక తెలిపారు. భారతదేశానికి చమురు, సహజవాయువు ఎగుమతి చేసే దేశాల్లో అమెరికా నెంబర్ వన్ అవుతుందని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్‌కు ఎఫ్ 35 యుద్ధ విమానాలు ఇస్తామని అమెరికా చెబుతోంది. అమెరికా- భారత్ రక్షణ వాణిజ్యం దాదాపు సున్నా నుంచి 20 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీని వల్ల అమెరికా భారత్‌కు మూడో అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా మారింది. భారతదేశానికి ఆయుధాల సరఫరాలో రష్యా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, భారత్ అమెరికా వైపు మళ్లడంతో రష్యా వాటా 62 శాతం నుంచి 34 శాతానికి (2017-2023 మధ్య) పడిపోయింది. రక్షణ సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి అమెరికా భారతదేశానికి సైనిక పరికరాల అమ్మకాలను "ఈ సంవత్సరం నుంచి అనేక బిలియన్ డాలర్లకు" పెంచుతుందని, చివరికి ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలను అందించడానికి మార్గం సుగమం చేస్తుందని ట్రంప్ అన్నారు. అయితే ఇది అంత సులభం కాదంటున్నారు నిపుణులు. "ఇది బాగానే ఉంది, కానీ ఇది గుర్రం ముందు బండిని పెట్టడం లాంటిది కావచ్చు" అని కుగెల్‌మన్ అన్నారు. భారతదేశానికి అమెరికా ఆయుధాల అమ్మకాలు పెరుగుతున్నప్పటికీ, అధికారిక అడ్డంకులు, ఎగుమతి నియంత్రణల వంటి సున్నితమైన సాంకేతిక పరిజ్ఞానాల బదిలీని పరిమితం చేస్తాయని ఆయన అంటున్నారు.

భారతదేశం 'ఎఫ్-35 ఆఫర్‌ను సీరియస్‌గా తీసుకోవడం లేదు' అని వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడు అజయ్ శుక్లా అన్నారు. అమెరికా ఆయుధ ఒప్పందాలు సవాళ్లతో కూడుకున్నవని శుక్లా పేర్కొన్నారు - ప్రైవేట్ సంస్థలు దీర్ఘకాలిక భాగస్వామ్యాల కంటే లాభాలకే ప్రాధాన్యత ఇస్తాయి. రష్యాతో భారత్ ఆయుధ ఒప్పందాలు ఆలస్యం కావడం, దీని వల్ల ఖర్చులు పెరగడం అమెరికాతో భారత రక్షణ సంబంధాలు మరింతగా బలపడే అవకాశం ఉంది.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గురించి నరేంద్రమోదీ ఎలాన్ మస్క్‌తో చర్చించారు. నరేంద్రమోదీ టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పుల గురించి ఆయనతో చర్చించినట్లు భారత విదేశాంగ శాఖ చెబుతోంది. భారత్‌లో స్టార్‌లింక్ సేవల్ని ప్రారంభించాలన్న మస్క్ ప్రణాళికలు ఆగిపోవడం లేదా భారతీయ మార్కెట్‌లోకి టెస్లా ఆగమనం గురించి వారు చర్చించారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. భారతదేశంలో స్టార్‌లింక్ సేవల్ని విస్తరించేందుకు తనకు నేరుగా స్పెక్ట్రమ్ కేటాయించాలని ఎలాన్ మస్క్ ఒత్తిడి చేస్తున్నారు. వేలం ద్వారా స్పెక్ట్రమ్ కొనుగోలు చేయాల్సి వస్తే ముకేశ్ అంబానీతో పోటీ పడాల్సి వస్తుంది. ప్రస్తుతం ఎలాన్ మస్క్ సంస్థకు లైసెన్స్ ఇచ్చే వ్యవహారం పెండింగ్‌లో ఉంది. టెస్లా భారతదేశంలో కార్ల తయారీ కర్మాగారాన్ని స్థాపించాలని అడుగుతోంది.

# కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ, బీఆర్ఎస్ ఫైర్..

విమర్శలు గుప్పిస్తున్నాయి విపక్షాలు. చిత్తశుద్ధిలేని సర్వేలు ఎన్నిసార్లు చేసిన బూడిదలో పోసిన పన్నీరే అంటున్నాయి. తెలంగాణలో కులగణన తప్పుల తడక అంటూ విపక్షాలు, బీసీ , ఎస్సీ ఎస్టీ సంఘాల నుంచి విమర్శలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది. తొలిరోజు రీసర్వేకు మంచి స్పందన వచ్చిందన్నారు అధికారులు. ఈనెల 28వరకు రీసర్వే కొనసాగుతుందని.. కులగణనలో వివరాలు నమోదు చేసుకోనివారంతా ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రెండోసారి సర్వేకోసం మూడంచెల విధానాన్ని అమలు చేస్తున్నారు అధికారులు. ఆన్ లైన్ తో పాటు ఆఫ్ లైన్ లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుంది తెలిపారు. ఫోన్ చేసిన వారి ఇళ్లకి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. తొలి దశ కులగణనలో పాల్గొననివారు తమ ఆధార్, మొబైల్ నంబర్, అడ్రస్, పోస్టల్ పిన్‌కోడ్ లాంటి వివరాలను కాల్ సెంటర్‌కు అందజేస్తున్నారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సెంటర్స్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఆ డీటెయిల్స్ ఆధారంగా సర్వే అధికారులే వారి ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏకంగా బీసీ కమిషన్ రంగంలోకి దిగింది. ఛైర్మన్ నిరంజన్ సహా బీసీ కమిషన్ సభ్యులు.. రాపోలు జయప్రకాశ్, సురేందర్ కూడా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. బీసీ కమిషన్ ఛైర్మన్ చాంద్రాయణగుట్ట కుమ్మరివాడి బస్తీలో తిరిగారు. గతంలో సర్వేలో పాల్గొనని వారి ఇంటికెళ్లి.. కులగణనలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని అవగాహన




కల్పించారు. గతంలో నిర్వహించిన సర్వేలో మొత్తం కోటి 15లక్షల కుటుంబాలకు గాను కోటి 12 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయి కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్ఈలో వెల్లడించింది. కులగణనలో పాల్గనని 3లక్షల 56వేల మంది కోసం రెండోసారి సర్వేకు అవకాశం కల్పించింది.

కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు..

రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ కులంపై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన కామెంట్స్ చేశారు. రాహుల్ గాంధీ కులము, మతము జాతి లేనివారంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ తల్లి సోనియాగాంధీ క్రిస్టియన్ అని, రాహుల్ గాంధీ తాత ఫిరోజ్‌ఖాన్ గాంధీ.. రాజీవ్ గాంధీ తండ్రి ముస్లిం అయితే రాహుల్ గాంధీ కూడా ముస్లిం అవుతారన్నారు. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కామెంట్లకు సంజయ్ కౌంటర్ ఇస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో కులం, మతం మీద చర్చ జరుగుతుండటం దురదృష్టకరమన్నారు. 1994లో మోదీ కులాన్ని బీసీగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. తండ్రి కులమే కొడుకుకు వస్తుందంటున్న కాంగ్రెస్ వాళ్లు సమాధానం చెప్పాలని.. నరేంద్ర మోదీ పక్కా ఇండియన్ అంటూ పేర్కొన్నారు. 10 శాతం ముస్లింలను బీసీలుగా మార్చారు. బీసీలకు ఇచ్చేది 32 శాతమే. 42 శాతం ఎలా అవుతుందన్నారు. లవ్ జిహాదీ, మత మార్పిడిలకు వ్యతిరేకంగా మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ చట్టం రావాలన్నారు. హిందూ బీసీలకు 42శాతం ఇస్తే కేంద్రం సహకరిస్తుందంటూ బండి సంజయ్ పేర్కొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. కాంగ్రెస్ చేసిన కులగణనను ఒక్క కులసంఘం కూడా ఆమోదించలేదని విమర్శించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి కులగణన కూడా చిత్తశుద్ధితో చేయడం లేదంటున్నారు బీఆర్ఎస్ నేతలు. బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి కనిపించడం లేదని ఆరోపించారు.. ఇక ఈ రీ సర్వేతోనైనా కులాల లెక్క తేలుతుందా? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తారా అని కులసంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

## నటి కృష్ణవేణి మృతి బాధాకరం: చంద్రబాబు



అమరావతి: ప్రముఖ నిర్మాత, నటి కృష్ణవేణి మరణం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. స్టూడియో అధినేతగా, పలు ఉత్తమ చిత్రాలను నిర్మించిన కృష్ణవేణి తెలుగు సినీ కీర్తిని చాటారని చెప్పారు. రఘుపతి వెంకయ్య అవార్డును అందుకున్నారని గుర్తుచేశారు. కృష్ణవేణి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తెలుగు సినీ చరిత్రలో కృష్ణవేణిది ఓ ప్రత్యేక అధ్యాయం: బాలకృష్ణ

నటిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా తెలుగు సినీ చరిత్రలో కృష్ణవేణిది ఓ ప్రత్యేక అధ్యాయమని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. కృష్ణవేణి బహుముఖ ప్రజ్ఞాశాలి అని చెప్పారు. విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు గారి నటజీవితానికి బాట వేసిన కృష్ణవేణి శివైక్యం చెందడం బాధాకరమని అన్నారు. 'మన దేశం' లాంటి గొప్ప చిత్రాలు నిర్మించి సమాజంలో ఉన్నత విలువలను పెంచడానికి ఆమె కృషి చేశారని చెప్పారు. ప్రభుత్వ పరంగా ఎన్నో అవార్డులు అందుకున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలలో, అంతకుముందు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలలో కృష్ణవేణిని ఘనంగా సత్కరించామని గుర్తుచేశారు. కృష్ణవేణి మృతి వ్యక్తిగతంగా తమకు తీరని లోటు అని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా కృష్ణవేణి కుటుంబ సభ్యులకు నందమూరి బాలకృష్ణ సానుభూతి తెలిపారు.

ఎన్టీఆర్ ను వెండితెరకు పరిచయం చేసి కృష్ణవేణి ప్రత్యేక గుర్తింపు పొందారు: పవన్ కల్యాణ్

పాత తరం నటి, నిర్మాత కృష్ణవేణి కన్నుమూసిన సంగతి తెలిసిందే. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. తెలుగు చలన చితర పరిశ్రమలో తొలి మహిళా నిర్మాతగా గుర్తింపు పొందిన కృష్ణవేణి గారు తుదిశ్వాస విడిచారని తెలిసి చింతించానని వెల్లడించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు. నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా కృష్ణవేణి గారు బహుముఖ ప్రజ్ఞ చాటుకున్నారని కొనియాడారు. ఎన్టీఆర్ ను, ఘంటసాలను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేయడం ద్వారా కృష్ణవేణి ప్రత్యేక గుర్తింపు పొందారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. కృష్ణవేణి గారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని వివరించారు.

# కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్

మొదటి పేజి తరువాయి



'ప్రధాని మోదీ గురించి నేను వ్యక్తిగతంగా మాట్లాడలేదు. మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పాను. పుట్టుకతో బీసీ కాదు కాబట్టే.. బీసీల పట్ల ప్రధానికి చిత్తశుద్ధి లేదని అన్నాను. దాంట్లో తప్పేముంది. నా వ్యాఖ్యలను బండి సంజయ్, కిషన్‌రెడ్డి, వక్రీకరించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలి' అని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీసీని ముఖ్యమంత్రి చేయలేదు.. రేవంత్ చేసిన ఈ కామెంట్స్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. 'దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. జాతీయ జనగణనలో బీసీ కులగణన ఎందుకు చేపట్టలేదు. ఒక్క బీసీని కూడా ఎందుకు ముఖ్యమంత్రిని చేయలేదు. ప్రధాని మోదీ కులం ఏంటో నాకు నిన్ననే తెలిసింది. సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రధానికి కులాన్ని ఆపాదించారు. కన్వర్టెడ్ బీసీ అంటూ అసంబద్ధ ఆరోపణ చేశారు' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ హయాంలోనే..'1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అప్పటి కాంగ్రెస్ సీఎం ఛబీల్‌దాస్ మెహతా హయాంలోనే మోదీకి సంబంధించిన కులాన్ని బీసీలోకి చేర్చారు. 1970 తర్వాతే అనంత్‌రామన్ కమిషన్ బీసీ కులాలను వెలుగులోకి తీసుకువచ్చింది. అప్పటివరకు 93 బీసీ కులాలుంటే.. ఆ తర్వాత 118కి పెరిగాయి. గౌడ, ముదిరాజ్, మున్నూరుకాపు, యాదవ ఇతరత్రా బీసీ కులాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు వీరందరినీ రేవంత్ కన్వర్టెడ్ బీసీలుగా పరిగణిస్తున్నారా?' అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

శుభోదయం



## వ్యక్తి మానసిక ఒత్తిడి నుండి బయటపడాలంటే ఆధ్యాత్మిక ధ్యానం అవసరం : బ్రహ్మకుమారి కళావతి




టంగుటూరు మండల రిపోర్టర్ – వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : వ్యక్తి మానసిక ఒత్తిడి నుండి బయటపడాలంటే ఆధ్యాత్మిక ధ్యానం అవసరమని బ్రహ్మకుమారి కళావతి (నాయుడుపేట) అన్నారు. ఆదివారం టంగుటూరు వాణి నగర్ లోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ ఉత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగింది. ఈ క్రమంలో బ్రహ్మకుమారి కళావతి ఈ సంస్థ నేపథ్యం గురించి మాట్లాడుతూ 1936–37 సంవత్సర కాలంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రారంభమైందని 24 వింగ్స్ తో సేవ చేస్తున్నామన్నారు. ఇక్కడ




సుఖ శాంతుల కోసం మెడిటేషన్ నేర్పడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాబోవు త్రిమూర్తి శివ జయంతి (శివరాత్రి) సందర్భంగా శివ జెండాను ముందుగా ఆవిష్కరించడం జరిగింది. తదనంతరం శాంతియాత్రను స్థానిక ప్రముఖులు బెజవాడ వెంకటేశ్వర్లు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్ర నిర్వాహకులు లత ఉష రాధిక తిరుపతిరావు స్థానిక కేంద్ర నిర్వాహకులు బ్రహ్మ కుమార్ కేశవ స్థానిక ఏ ఎస్ ఐ శ్రీనివాసులు ప్రముఖ వైద్యులు డాక్టర్ కృష్ణారావు తదితరులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## మహిళలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలి : మాలె రంగారెడ్డి




సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): సింగరాయకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షుమారు లక్షా యాభై వేల రూపాయలు విలువ చేసే కుట్టు మిషన్లు 18 మంది మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు.రోటరీ క్లబ్ అధ్యక్షులు మాలె రంగారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, హైదరాబాద్ కు చెందిన బి.జి.ఆర్ మైనింగ్ ఎండ్ ఇన్ఫ్రా లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక కుట్టు మిషన్లు అందించగా సింగరాయకొండ రోటరీ క్లబ్ తమ వంతు వాటాధనం చెల్లించి ఈ ప్రాజెక్టు నిర్వహించామన్నారు.అదేవిధంగా మహిళలు స్వయంసంవృద్ధి చెంది ఆర్థికంగా బలపడటానికి వారికి కుట్టు మిషన్లు అందజేస్తున్నామని,ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు చేదోడు వాడోడుగా ఉండాలని పిలుపునిచ్చారు.డి కె డి ప్రసాద్ మాట్లాడుతు టైలరింగ్ వృత్తి ద్వారా ఆర్థికంగా స్థిరపడ్డ మహిళలు చాలా మంది ఉన్నారని, తమ వృత్తికి సృజనాత్మకత జోడించి మంచి పేరు తెచ్చుకున్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు.సభకు అధ్యక్షత వహించిన రోటరీ క్లబ్ కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు తమ ఆదాయంలో ఖర్చులు పోను మిగిలింది పొదుపు కాదని,కొంత మొత్తం పొదుపు చేసి మిగిలిన ఆదాయమును ఖర్చు చేసినప్పుడు అది పొదుపుగా భావించబడుతుందని తెలియజేశారు.కార్యక్రమంలో క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ నాగసూరి వెంకట సుబ్బారావు, రోటరీ సభ్యులు కళ్యాణ్, లబ్ధిదారులు మరియు మాలె రంగారెడ్డి మిత్రులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా, స్త్రీ, పురుషుల, టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ సింగరాయకొండ నందు జిల్లా జట్ల ఎంపిక జరిగింది. పురుషుల యందు ఆర్. కార్తికేయ ,ఎం .శివ శంకర్ , వి. వెంకటేశ్వర్లు రెడ్డి, డి. కౌశిక్, బాబు ,కే .హర్షవర్ధన్, మహిళలందరూ బీ,జాస్మియా, పి .జాహ్నవి ,ఎల్. నికిత, బి. పద్మ ,బి. కృప ,ఎంపికయ్యారు. వీరు 20, 27వ తేదీ తూర్పుగోదావరి జిల్లా లో రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా సెక్రటరీ ఎన్ .టి. ప్రసాద్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ కే. శంకర్రావు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న దద్దాల మంజు భార్గవి




కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): వెలిగండ్ల మండలం జాళ్లపాలెం సర్పంచ్ శ్యామల కృష్ణారెడ్డి గారి కుమార్తె శ్యామల లాస్య పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారి సతీమణి దద్దాల మంజు భార్గవి.ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ,వైసీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గుంటక తిరుపతి రెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి,మాజీ జడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు,మాజీ సింగల్ విండో అధ్యక్షులు పోల్లా సుబ్రహ్మణ్యం,ఎంపీటీసీ పాపబత్తిన నాగేశ్వరావు,కుప్పనబోయిన వెంకటరామయ్య,మాజీ సింగల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్ల,ఎలిక నారాయణ,సర్పంచ్ జేమ్స్, ఉప సర్పంచ్ రాయల్ల గురు బ్రహ్మం, మేడం ఆదిరెడ్డి, చిన్న పేరయ్య,తాతపూడి




నాని, గంజి రవీంద్ర రెడ్డి,సోషల్ మీడియా సభ్యులు రాయల్ల గురు,చాగని ఈశ్వర్ రెడ్డి, కొణతం కేశవరెడ్డి, కొణతం లింగారెడ్డి,నూరు బాషా సంగం అధ్యక్షుడు కారుమంచి బాల సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు..

## టెలికాం అడ్వైజర్ కమిటీ మెంబర్ గా మస్తాన్ వలి




కనిగిరి రిపోర్టర్ – జి.ప్రసాదరావు (శుభోదయం న్యూస్): బిఎస్ఎన్ఎల్ గుంటూరు జోన్ టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ గా కనిగిరి పట్టణానికి చెందిన మస్తాన్ వలిని నియమిస్తూ కేంద్ర బిఎస్ఎన్ఎల్ చైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ ఊర్వశి సంగ్యాన్ సంఘం నుంచి ఉత్తర్వులిచ్చారు.

## దోర్నాల మండలం ఎడవల్లి గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి




దోర్నాల మండల రిపోర్టర్– ఆవులయ్య ( శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం ఎడవల్లి గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య 11 నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్ ఆదివారం తనిఖీ చేశారు. వ్యవసాయ అధికారి జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పథకాలు రైతులు లబ్ధి పొందాలంటే కచ్చితంగా11 విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు. పి ఎంకిసాన్ చెల్లింపులు, పెట్టుబడి సాయం, పంటల భీమా రాయితీపై సూక్ష్మ




పోషకాలు, అన్నదాత సుఖీభవ రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ ,తదితర పథకాలు వర్తిస్తాయి అన్నారు. నమోదుకు కావలసిన ఆధారాలు రైతు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డుకు లింక్ అయినా ఫోన్ నెంబర్ తీసుకొని రైతు సేవ కేంద్రంలో నమో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎడవల్లి గ్రామ రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలి

## రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గూడవల్లి నరసింహారావు



విజయవాడ రూరల్ (శుభోదయం న్యూస్) : ప్రసాదంపాడు ఫిబ్రవరి 16 : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు పెద్దల సభకు గౌరవమని రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గూడవల్లి నరసింహారావు అన్నారు. ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు ఆదివారం ఉదయం విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో టీడీపీ రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గూడవల్లి నరసింహారావు ఆధ్వర్యంలో గ్రామంలోని ఎమ్మెల్సీ ఓటర్లను నేరుగా కలిసి వారికి కరపత్రాన్ని అందజేసి మొదటి ప్రాధాన్యత ఓటును వేయవలసిందిగా అభ్యర్థించారు. మహిళా ఎమ్మెల్సీ ఓటర్లకు తెలుగు మహిళలు బొట్టు పెట్టి ప్రథమ ప్రాధాన్యత ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం ద్వారానే పట్టభద్రులకు మేలు జరుగుతుందని వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి మహేష్, దాసరి సాయి, రామకృష్ణ నూతి, సుభాషిని, నెక్కంటి శ్రీదేవి, వెంకటేష్ (ఆడిటర్), గూడవల్లి శివ నాగేశ్వరావు, దోనేపూడి లోహిత్, రాజేష్, వంశీ, శ్వేత, శ్రావణి, జనసేన మహేష్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు రమణ, కోలా సతీష్ కుమార్, కె ఎన్ ఆర్, శ్రీ శాంతి, ప్రవీణ, జగన్, శ్రీవిద్య, కోనేరు సుబ్బారావు, చలసాని సుధీర్, యార్లగడ్డ చౌదరి, దేవి, స్వాతి, ఉమా, పద్మ, నాగమణి, ఇజ్జి రాము, బాలు మరియు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య జన్మదిన వేడుకలు



యాడికి ఫిబ్రవరి 16 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ )మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీలోని చిట్టెపు చంద్రశేఖర్ రెడ్డి ఇంటి దగ్గర మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య జన్మదిన వేడుక జరపడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిమానుల మధ్య తన పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రుద్రమ నాయుడు మాజీ ఎంపిటిసి దడియాల ఆదినారాయణ, కుమార్ రావు, బాలం శ్రీనివాసులు, వసంత నారాయణ స్వామి, పూల తోట చంద్ర, మహమ్మద్ రఫీ, గంగాధర, గుండా నారాయణస్వామి, గొందిపల్లి రామాంజనేయులు, దాసరి నారాయణస్వామి తదితర కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం జరిగినది..

## నాయకుల మౌఖిక ఆదేశాలు పాటిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పవు : నేదురుమల్లి

## నగరవనం ప్రారంభోత్సవ శిలాఫలకంలో తిరుపతి ఎంపీ పేరు లేకపోవడం సరికాదు



వెంకటగిరి నియోజకవర్గం ఇన్చార్జ్ – వీసీ.సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త శ్రీ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదివారం స్థానిక నివాసంలోని ఎన్ జే ఆర్ భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల మౌఖిక ఆదేశాలు పాటించి అక్రమంగా నడుచుకుంటే అధికారులకు ఇబ్బందులు తప్పవు అని తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 21న వైఎస్ఆర్సిపి నాయకుడు పేచి రాజును తెల్లవారుజామున నాలుగు గంటలకు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన వ్యవహారంలో కోర్టును ఆశ్రయించగా పోలీస్ స్టేషన్ సి సి ఫుటేజీలు సంబంధిత అధికారుల కాల్ రికార్డులను కోర్టు కోరడం అనంతరం పేచిరాజుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడం న్యాయమే గెలుస్తుంది అనేదానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. ఇక ఇటీవల పట్టణంలో ఏర్పాటైన నగరవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి పేరు శిలాఫలకంలో లేకపోవడం పై అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎంపీ దళిత వర్గానికి చెందిన వ్యక్తి అని తలచారు మరి ఏ కారణంతో ఆయన పేరు శిలాఫలకంలో గల్లంతయిందో వారికే తెలియాలి అన్నారు .ఈ వ్యవహారంలో ప్రివిలేజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటులో ముఖ్యుడు డిప్యూటీ సీఎం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పేరు సైతం శిలాఫలకంలో లేకపోవడం ఆ కూటమి పార్టీల సొంత విషయమని ఆ వ్యవహారం జోలికి తాను వెల్లబోనని తెలిపారు ఇక వెంకటగిరి అభివృద్ధికి నేదురుమల్లి కుటుంబం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని పేర్కొన్నారు .తిరుపతి నెల్లూరు కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో అధికారులు నిబంధనలను పాటించలేదన్నారు. మార్చి నెలలో రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో చైర్పర్సన్ చైర్మన్ ల మార్పు జరుగుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో వెంకటగిరిలో అలాంటి ప్రయత్నం జరిగితే దానిని ఎలా తిప్పి కొట్టాలో తనకు సంపూర్ణ అవగాహన ఉందని,అధికారులు నిబంధనలు విధిగా పాటించాలని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## వసంతం వారి పెళ్లికి హాజరైన మండల టిడిపి నాయకులు



యాడికి ఫిబ్రవరి 16 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ )మండలం కేంద్రంలోని హాస్పిటల్ కాలనీలో ని రాముల గుడి లోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఆదివారం వసంతం నాగరత్నమ్మ, వసంతం శ్రీనివాసులు ద్వితీయ కుమారుడు ఉదయ్ కుమార్ ,హేమలత కళ్యాణానికి మండల టిడిపి నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుదేశం మండల కన్వీనర్ గోర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీటీసీ దడియాల ఆదినారాయణ, తదితర టిడిపి నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా 554వ శ్రీకృష్ణదేవరాయల జయంతి




యాడికి ఫిబ్రవరి 16 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) మండల కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతి వేడుకలను బలిజ సంఘం అధ్యక్షులు బండారు హరినాథ్ (గురు స్వామి) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెయిన్ బజార్ లో ఉన్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలలతో అలంకరించి, శ్రీకృష్ణదేవరాయల పాలన , హిందూ తత్వాన్ని రక్షించిన విధానాన్ని ఆయన చేసిన సేవలను జనసేన మండల కన్వీనర్ సునీల్ ఈ సందర్భంగా కొనియాడారు. బండారు హరినాథ్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవ రాయలు విజయనగర చక్రవర్తి. ఇతను ఇరవై సంవత్సరాల వయసులో 1509 ఫిబ్రవరి 4న విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించాడు. రాయల పాలనలో విజయనగర సామ్రాజ్యము అత్యున్నతస్థితికి చేరుకున్నది. కృష్ణరాయలను తెలుగు, కన్నడ ప్రజలు భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో ఒకడిగా అభిమానిస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ సభ్యులు నారాయణస్వామి, గిరి, రామంజి, రాయుడు, శీన, జగదీష్ , సురేష్, తదితర బలిజ కులస్తులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టండి ఋ- దేశ, విదేశీ పారిశ్రామిక వేత్తలతో మంత్రి సవిత



శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై.పోతులయ్య (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టండి అని దేశ విదేశీ పారిశ్రామికవేత్తల కు మంత్రి సవిత తెలిపారు.ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ భారత్ టెక్స్–2025 కార్యక్రమంలో పాల్గొనడానికి ఢిల్లీవెళ్లిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదివారం పలువురు దేశ, విదేశ పారిశ్రామిక వేత్తలను కలిశారు. చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించాలన్న లక్ష్యంతో పాటు పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం భారత్ టెక్స్–2025 ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత పలువురు పారిశ్రామిక వేత్తలను కలిశారని పెనుకొండ పట్టణంలోని మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు తీసుకుంటున్న చర్యలు గురించి పారిశ్రామికవేత్తలకు మంత్రి సవిత వివరించారు. ఇటీవలే నూతన టెక్స్ టైల్స్ పాలసీని తీసుకొచ్చినట్లు వివరించారు. పెట్టుబడులు పెట్టడానికి ఏపీ అనువైన ప్రాంతమని, పరిశ్రమల స్థాపనకు తక్షణ అనుమతులు, రాయితీలు ఇవ్వడంతో పాటు భూ కేటాయింపులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రాష్ట్రంలో చేనేత రంగంలో పెట్టుబడులకు ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు మంత్రి ఆహ్వానించారు. ఏపీలో టెక్స్ టైల్స్ రంగానికి అవసరమైన నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే మేలైన పట్టు, చేనేత వస్త్రాలు ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తవుతున్నాయన్నారు. చేనేత వస్త్రాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పనలో భాగంగా రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత ఎగ్జిబిషన్లు, ఎక్స్ పో లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగిస్తూ వారికి365 రోజుల పని కల్పించే లక్ష్యంతో




టెక్స్ టైల్స్ పార్కులు, వీవర్ శాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూలు కొనుగోలుపై 15 శాతం మేర రాయితీ అందిస్తున్నామన్నారు. ప్రజల్లో చేనేత వస్త్రాల వినియోగంపై పెరుగుతున్న మక్కువను దృష్టిలో పెట్టుకుని ఈ కామర్స్ ద్వారా విక్రయాలు ప్రారంభించామన్నారు. అమెజాన్, మింత్రా, ఫ్లికార్ట్, జియో మార్ట్ వంటి ఏడు ఆన్ లైన్ ప్లాట్ ఫారమ్ ల్లో 20 ఆప్కో షో రూమ్ ల ద్వారా చేనేత వస్త్రాలను నేరుగా కస్టమర్ల ఇళ్లకే డోర్ డెలివరీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. చేనేత సహకార సంఘాలు చెల్లిస్తున్న జీఎస్టీ రీయింబర్స్ మెంట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల, మర మగ్గాల కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వనున్నామన్నారు. నేతన్నలకు 90 శాతం సబ్సిడీతో ఆధునిక పరికరాలు,యంత్రాలు అందజేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట రాష్ట్ర చేనేత,జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పావనమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి సవితకు ఏపీ భవన్ లో ఘన స్వాగతం లభించింది.

# కనిగిరి డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కొరకు విరాళాల చెక్కును ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి అందజేస్తున్న దాతలు



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి ప్రాంత ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కి 25000/- విరాళ చేక్కును అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు చల్లగిరిగల్లకు చెందిన గుదే వేంకటేశ్వర్లు, మరి కొంతమంది తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కనిగిరి నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ రావినూతల కోటయ్య మాదిగ తదితరులు ఉన్నారు.

# అంధకారంలో కొక్కంటి క్రాస్



తనకల్లు, మండల రిపోర్టర్. రవీంద్ర (శుభోదయం న్యూస్): నిత్యం జనసంద్రంగా ఉన్న కొక్కంటి క్రాస్ నేషనల్ హైవే లో గత ఏడాది నుండి విద్యుత్ దీపాలు వెలగలేదు. ఈ విషయాన్ని చాలా సార్లు పంచాయతీ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లితే వారు నేషనల్ హైవే అధికారుల మీద చెప్పుకొచ్చారు. కారణమేదైనా వారి మీద వీరు వీరు మీద వారు చెప్పుకుని సంవత్సరం నుండి కొక్కంటి క్రాస్ అంధకారంలోవుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాల్మీకి జిల్లా అధ్యక్షుడు మల్లెం అశోక్ డిమాండ్ చేశారు.

## పుట్టపర్తి నియోజకవర్గానికి హంద్రీనీవా వరప్రదాయనిమి 195 చెరువులకు నీళ్లు ఇవ్వడమే నాజీవితాశయం

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి




-శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై.పోతులయ్య శుభోదయం న్యూస్ ): పుట్టపర్తి నియోజకవర్గం లోని 195 చెరువులకు నీళ్లు ఇవ్వడమే నాజీవితాశయం అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. సోమవారం బుక్కపట్నం మండలంలోని జానకంపల్లి వద్ద రూ. 400కోట్ల తో హంద్రీనీవా లైనింగ్ పనులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు.కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే అపరభగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే సింధూరరెడ్డి తెలిపారు.హంద్రీ నీవా ద్వారా పుట్టపర్తి నియోజవర్గం మరో కోస్తాంధ్ర తయారవుతుంది అని ఆమె తెలిపారు.ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పుట్టపర్తి మండలంలోని జగరాజు పల్లి వద్ద మంగళకర డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని రెండు నీటి రిజర్వాయర్లతో పాటు 193 చెరువులు నింపడమే నా జీవిత ఆశయమని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణాజిల్లాలతో నింపి రైతు కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే నా జీవిత సంకల్పం అన్నారు. కరువు ప్రాంతమైన సత్య జిల్లాలోని పుట్టపర్తి నియోజకవర్గం సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో అపర భగీరథుడు మన ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టితో హంద్రీనీవా కాలువ వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ,రాష్ట్రసాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి ,జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అపర భగీరథుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో రాయలసీమను మరో కోస్తా ఆంధ్రగా మార్చాలనే ఉద్దేశంతో హంద్రీనీవా కాలువ వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సోమవారం బుక్కపట్నం మండలంలోని జానకం పల్లి వద్ద రూ. 400 కోట్లతో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ లైనింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పుట్టపర్తి నియోజకవర్గం లోని రైతులు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో శ్రీ విద్యానికేతన్ విద్యార్థులు




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ మూలగుంటపాడు: శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమంలో భాగంగా పాకల సముద్ర తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారు.స్వర్ణాంధ్ర - 2047 కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు పాకల సముద్ర తీరాన్ని పరిశుభ్రం చేసి, పర్యావరణ పరిరక్షణకు తమ భాగస్వామ్యాన్ని చాటారు.ఈ కార్యక్రమాన్ని పాకల గ్రామ సర్పంచ్ శ్రీ సైకం చంద్రశేఖర్ రావు, మెరైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ షేకీ మస్తాన్ షరీఫ్, శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ డైరెక్టర్ శ్రీ సైకం వెంకటేశ్వర రావు లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీ సైకం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవచ్చుని, పాకల గ్రామాన్ని ఆహ్లాదకరమైన సముద్ర తీర ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొని, సముద్రతీర పరిశుభ్రతకు తమ మద్దతును తెలిపారు.

# కుంకి ఏనుగులు ఎప్పుడొస్తాయి...? ఏనుగుల భారినపడి ఇంకెంతమంది చావాలి..!!



పార్వతీపురం, మన్యం జిల్లా, బొద్దాన.శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):ఏనుగుల సమస్య పరిష్కారానికి పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి ఉపముఖ్యమంత్రి కుంకీ ఏనుగుల మాట ఏమైంది...?ప్రభుత్వాలు తలచుకుంటే పెద్ద సమస్య ఏమి కాదు గత పాలకులు, జిల్లా కలెక్టర్ చేపట్టిన చర్యలు శూన్యం.ఇప్పటి పాలకులు, జిల్లా కలెక్టర్ అయినా చర్యలు చేపట్టాలి ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని జిల్లాలోనే ఏర్పాటు చేయాలి దానిని పర్యాటక కేంద్రంగా మలచి రాబడి సాధించాలిజరిగిన ఆస్తి నష్టాన్ని బాధితులకు అందజేయాలి వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలిఒవైపు 12 మంది ప్రజలు, మరోవైపు 7 ఏనుగులు మృతి చెందడం బాధాకరం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావుఏనుగుల సమస్య పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన కుంకీ ఏనుగులు ఎప్పుడొస్తాయని, ఏనుగుల భారిన పడి ఇంకెంత మంది చావాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన పార్వతీపురంలో ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, కోలా కిరణ్, శిరసపల్లి సాయి శ్రీనివాస్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏనుగుల బారిన పడి ఇప్పటివరకు 12 మంది మృతి చెందగా, సుమారు 6 కోట్ల రూపాయలు మేర ఆస్తులు ధ్వంసం కావటం బాధాకరమన్నారు. కుంకీ ఏనుగులు రప్పించి ఏనుగుల సమస్య పరిష్కరిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలు ఏమయ్యాయన్నారు. 2017లో పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు ఇప్పటివరకు 12 మందిని పొట్టను పెట్టుకోవడం విచారకరమన్నారు . అలాగే మన జాతి సంపదైన ఏడు ఏనుగులు మృతి చెందటం, ఒక ఏనుగు కనిపించకపోవడం మరింత బాధాకరమన్నారు. ఇటువైపు ప్రజలు, మరోవైపు ఏనుగులు మృత్యువాత పడుతున్నప్పటికీ పాలకులు, అధికారుల్లో కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. మానవ హక్కులు, వన్యప్రాణ సంరక్షణ చట్టాలు ఎక్కడ అమలవుతున్నాయో ఎరుక లేదన్నారు . ప్రభుత్వాలు తలుచుకుంటే ఈ ఏనుగులు సమస్య పరిష్కారం పెద్ద సమస్యేమీ కాదన్నారు. గతంలో మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు అటవీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఏనుగులు వీర ఘట్టం ప్రాంతంలోకి అప్పట్లో వచ్చాయన్నారు. చెన్నై నుండి ట్రైనీ ఏనుగులను రప్పించి వాటిని జూకి తరలించి ఏనుగులు సమస్య పరిష్కరించాలన్నారు. అనతి కాలంలోనే చర్యలు చేపట్టి ప్రజలకు అప్పట్లో ఏనుగుల సమస్య లేకుండా చేశారన్నారు. కానీ ఇప్పుడు పాలకుల చేతగానితనం, అధికారుల అలసత్వం ఇటు ప్రజలు, ఏనుగులు మృత్యువాత పడుతూ ఉండటం బాధాకరమన్నారు. జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు గుంపు ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని, అవి స్వంతం చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇటు ప్రజల ప్రాణాలను తీస్తూ, అవి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 12 మంది ప్రజల ప్రాణాలను బలి తీసుకోగా, ఏనుగులు కూడా ఏడు మృతి చెందాయన్నారు. ఒక ఏనుగు ఎటు పోయిందో అలికిడి లేదన్నారు. పాలకులకు, అధికారులకు ఇటు ప్రజల ప్రాణాలు, అటు ఏనుగుల ప్రాణాల విలువ తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. ఎక్కడైనా సంఘటన జరిగితే వచ్చి ఎంతో కొంత నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ప్రాణాలకు విలువ కట్టడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పరిస్థితి నెలకొంటుందన్నారు. గత ప్రభుత్వం, ఆ ప్రభుత్వంలో ఉన్నత పదవులు అనుభవించిన జిల్లాకు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగులు సమస్య పరిష్కరించకపోవడం ప్రజలు దౌర్భాగ్యం అన్నారు. జిల్లా ఆవిర్భావం నుండి ఇద్దరు జిల్లా కలెక్టర్లు వచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటి ఉమ్మడి ప్రభుత్వ పాలకులైన మంత్రి, ఎమ్మెల్యేలతో పాటు ఇప్పటి జిల్లా కలెక్టర్ ఏనుగుల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని సొంతం చేసుకున్న ఏనుగులను ఇక్కడి నుంచి తరలించడం దాదాపు అసాధ్యమే అన్నారు. కాబట్టి ఇక్కడ గతంలో గుర్తించిన సీతానగరం, అంకుళ్లవలస తదితర ప్రాంతాలలో ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఏనుగులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు . ఆ కేంద్రాన్ని భవిష్యత్తులో పర్యాటక కేంద్రంగా మలచి ఆర్థికంగా కూడా ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు అన్నారు. ప్రభుత్వం తలుచుకుంటే ఏనుగుల సమస్య పెద్ద సమస్య కాదన్నారు. కానీ పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని ఆరోపించారు. ఏనుగులు జిల్లాలో పర్యటించే ప్రాంతాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను సంబంధిత శాఖ అధికారులు తీసుకోకపోవడంతో ఏనుగులు మృత్యువాత పడ్డాయన్నారు. వణ్య ప్రాణ సంరక్షణ చట్టాన్ని తుంగలో తొక్కిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తృణప్రాయంగా ప్రజల ప్రాణాలు పోతున్న తరుణంలో వాటికి సంబంధించిన శాఖాధికారులు బదులిచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. 2017లో జిల్లాకు వచ్చిన ఎనిమిది ఏనుగులలో మూడు ఏనుగులు మృత్యువాత పడగా హరి అనే ఏనుగు కనిపించకుండా పోయిందన్నారు. ఈ కాలంలో ఏనుగులు గుంపు మరో నాలుగు సంతతిని వృద్ధి చేసుకున్నాయన్నారు. ఇప్పుడు ఇటువైపు 8 ఏనుగుల గుంపు పర్యటిస్తోందన్నారు . అలాగే సీతంపేట ప్రాంతానికి వచ్చిన 7 ఏనుగులు గుంపులో మూడు ఏనుగులు మృత్యువాత పడగా 4 ఏనుగులు ఆ ప్రాంతంలో పర్యటిస్తున్నాయన్నారు. ఇక్కడ ఉన్న ఎనిమిది అక్కడ ఉన్న నాలుగు ఏనుగులకు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సకల సదుపాయాలు కల్పించి వాటి ప్రాణాలను రక్షించాలని కోరారు. అలాగే ఇప్పటివరకు జరిగిన ఆస్తి నష్టాన్ని తక్షణమే బాధితులకు అందజేయాలన్నారు. భవిష్యత్తులో ఇటు ప్రజల ప్రాణాలు కాని, ఏనుగులు ప్రాణాలు కాని పోకుండా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఏనుగుల దాడిలో సిబ్బంది కూడా మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ఏనుగుల బారిన పడి మృతి చెందిన వారి బాధితకుటుంబాల అందరికీ సమానంగా నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. దాదాపు 6 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇప్పటికీ ఇంకా సుమారు కోటి రూపాయలు వరకు ఆస్తి నష్టం బకాయిలు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఏనుగుల బారిన పడి మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ.20 లక్షలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏనుగుల భారిన పడి మరి కొంతమంది చావక ముందే ఏనుగుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ఉద్యోగం పొందడం అనేది ప్రతి ఒక్కరి జీవిత కల

## మీ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి. మంత్రి నారాలోకేష్ చొరవతో భవిష్యత్ లో నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్తు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి ఋ




శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య ( శుభోదయం న్యూస్ ):జీవితంలో ప్రతి మనిషి తొలి ఉద్యోగం పొందడమనేది ఒక గొప్ప అనుభూతిగా మిగిలిపోతుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాల లో ఆదివారం పీవీ కేకే ఇంజనీరింగ్




కళాశాల వారి సౌజన్యంతో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. జాబ్ మేళాకు ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డి.ఎస్.పి విజయ్ కుమార్ పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి ,మంగళకర కళాశాలల ప్రిన్సిపల్ బిందుజ ప్రిన్సిపల్ రమేష్ బాబు, జయచంద్రారెడ్డి హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే చే జ్యోతి ప్రజ్వలన గావించారు. జాబ్ మేళాకు పుట్టపర్తి నియోజకవర్గంలోని సుమారు 1600 మందికిపైగా నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు సుమారు 60 ప్రముఖ కంపెనీలు టెక్ మహీంద్రా, విప్రో ,అరవిందో ,నోకియా, పేటీఎం ,ఫోన్ పే ,ఎయిర్టెల్ ,ఐసిఐసిఐ ,జీఎంఆర్ ,జిజే సొల్యూషన్స్ ,హీరో కంపెనీతో పాటు ఇతర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో సుమారు 305 మంది వివిధ కంపెనీలకు సెలెక్ట్ అయి నియామక పత్రాలు అందుకున్నారు. మిగతా 390 మంది షార్ట్ లిస్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఆయా కంపెనీల నుంచి నియామక కాల్ లెటర్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా అభ్యర్థులకు అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడి చదవడం ఎంత ముఖ్యమో జీవితంలో ఉద్యోగం పొందడం కూడా అంతే ముఖ్యం అన్నారు. ప్రతి మనిషి తొలి ఉద్యోగం పొందడం జీవితంలో మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుందని అన్నారు. ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మన విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఐదేళ్లలో సుమారు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తాను స్వయంగా పుట్టపర్తి నియోజకవర్గ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా మెగా జాబ్ మేళా నిర్వహించి వివిధ కంపెనీల్లో ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకే మన పుట్టపర్తి నియోజకవర్గంలో ఉన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు కల్పించేందుకు సుమారు 60 కంపెనీలు ముందుకు వచ్చాయని ప్రతి ఒక్కరు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. భవిష్యత్తులో మన ఆంధ్రప్రదేశ్ ఐటి రంగంలోనే కాకుండా ఏఐ రంగంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అలాంటి నమ్మకం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఉన్నారనే విశ్వాసం రాష్ట్ర ప్రజానీకానికి ఉందన్నారు. వైజాగ్ మరో ఆర్థిక రాజధాని కాకుండా ఐటీ కేంద్రంగా భవిష్యత్ లో నిలుస్తుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యోగం పొంది తమ కలలను సాకారం చేసుకోవాలని నిరుద్యోగులను కోరారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఎంతో డైనమిక్ యువ ఎమ్మెల్యే అని ఆమె హయాంలో నియోజకవర్గంలో ప్రజలకు సంక్షేమం ,అభివృద్ధి, కార్యక్రమాలు చేస్తూ ఇలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తో కంపెనీలతో మాట్లాడి వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయనే నమ్మకం తమకు ఉందన్నారు. నియోజకవర్గ నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి కల్పన ధ్యేయంగా పనిచేస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అభినందించారు.ఆర్టీవో సువర్ణ మాట్లాడుతూ, తను సామాన్య కుటుంబం నుంచి ఆర్డీఓ స్థాయికి వచ్చానంటే ప్రధాన కారణం చదివే అన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి ఉద్యోగాన్ని పొందడం జీవిత ఆశయం అన్నారు. మన నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్ మేళా కు భారీగా తరలివచ్చిన నిరుద్యోగులకు ప్రముఖ కంపెనీలు మన ప్రాంతానికి వచ్చి ఉద్యోగాలు అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు.అందుకు మన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి,ఇక్కడికి విచ్చేసిన 60 కంపెనీల యాజమాన్య ప్రతినిధులకు ఆర్డీఓ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డి.ఎస్.పి విజయ్ కుమార్ మాట్లాడుతూ, నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగము జీవితంలో బంగారు భవిష్యత్తు నిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను సద్వినియం చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ , పుట్టపర్తి మండల కన్వీనర్ విజయ్ కుమార్ ,మాజీ జెడ్పిటిసి శ్రీ రామ్ నాయక్, పీవీకే కే కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి ఇంతియాజ్ ,కరీం , పీవీ కేకే కళాశాల ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.పుట్టపర్తిలో పలు వివాహాలకు,గృహ ప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో ఆదివారం జరిగిన పలు వివాహాలకు గృహప్రవేశానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు.పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన టీడీపీ మాజీ కౌన్సిలర్ చెన్న కృష్ణమ్మ కుమారుడు సాయి మోహన్ వెడ్స్ సరిత వివాహానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి చీరను వారికి బహుకరించారు. అదేవిధంగా పుట్టపర్తి మున్సిపాలిటీలో కూటమి పార్టీ కుటుంబ సభ్యుడు గృహప్రవేశానికి మాజీ మంత్రి హాజరయ్యారు నూతన గృహప్రవేశానికి విచ్చేసిన వారందరినీ మాజీ మంత్రి ఆప్యాయంగా పలకరించారు. నూతన గృహప్రవేశ సందర్భంగా వేద పండితులు అందించిన అక్షింతలను స్వామివారికి సమర్పించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. పుట్టపర్తి మండలం జగరాజు పల్లి వద్ద శ్రీనివాస గార్డెన్ కెసిఆర్ గ్రాండ్ లో నిర్వహించిన మెగావత్ వారి పెళ్లి సందడి కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు నూతన వధూవరులు వర్షిని వెడ్స్ బాలాజీ నాయక్ ను మాజీ మంత్రి ఎమ్మెల్యే అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామకూటి ఆదినారాయణ , టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ,మండల కన్వీనర్ విజయ్ కుమార్ మాజీ జెడ్పిటిసి శ్రీ రామ్ నాయక్, ప్రభుత్వ డాక్టర్ రామస్వామి నాయక్ బిహెచ్ఇఎల్ టిజియం గోపాల్ నాయక్ తో పాటు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గుంటూరు జిజిహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ముక్కు కవితకి అరుదైన పురస్కారం



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ కేర్ అవార్డ్స్ 2025 ఆరోగ్య సంరక్షణ రంగంలో గణనీయమైన కృషి చేసినందుకు మార్గదర్శకులను గుర్తించి సత్కారం చేస్తోంది.టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ కేర్ అవార్డులను ఫిబ్రవరి 16, 2025న వైజాగ్ లో నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందించడంలో మెరుగైన పాత్ర వహించి గణనీయమైన కృషి చేసినందుకు గాను డాక్టర్ కవిత గారికి కేంద్ర మంత్రివర్యులు శ్రీ కింజరపు రామమోహన్ నాయుడుగారి చేతుల మీదుగా అవార్డు స్వీకరించడం జరిగింది.

## లేపాక్షి శ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని సందర్శించిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి శ్రీ సత్య సాయి జిల్లా ఇన్చార్జ్ బాలకృష్ణ యాదవ్.



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) బిజెపి రాష్ట్ర కార్యదర్శి మరియు శ్రీ సత్య సాయి జిల్లా ఇన్చార్జి బాలకృష్ణ యాదవ్ కుటుంబ సమేతంగా లేపాక్షి శ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని సందర్శించడం జరిగింది, వారికి ఆలయ మర్యాదలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ అర్చకులు శ్రీనివాసులు శర్మ వారికి దృశ్యాలతో సత్కరించి దేవాలయ ప్రతిష్ట గురించి వివరించడం జరిగింది బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేసిందంటూ అదే విధంగా



రాష్ట్రంలో దేశంలో ఎన్ డి ఏ పాలన దేశాన్ని అభివృద్ధి పదం వైపు దూసుకు వెళ్లే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు నిరంతరం పనిచేస్తున్నారని గతంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు లేపాక్షి ఆలయాన్ని సందర్శించి ఇక్కడి చరిత్రను తెలుసుకొని చాలా సంతోషపడ్డారు అని ప్రధానమంత్రి ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందిందని రాముడు నడయాడిన ప్రాంతం లేపాక్షి కాబట్టి ఈ ప్రాంత ప్రజలు చాలా అదృష్టవంతులని వారు సంతోషం వ్యక్తం చేశారు . వారి వెంట లేపాక్షి మండల అధ్యక్షులు ఎం నరసింహమూర్తి,ప్రధాన కార్యదర్శి సిరివరం మూర్తి. సాయి. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలోత్సవంలో గీతం విద్యార్థుల ప్రతిభ సోలార్ సైకిల్‌కు ద్వితీయ బహుమతి



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్) :- ఒంగోలు, ఫిబ్రవరి 2025: "టెక్నాలజీ అంటే గీతం, గీతం అంటే టెక్నాలజీ" అనే నినాదాన్ని మరోసారి నిజం చేస్తూ, సింగరాయకొండ గీతం విద్యార్థులు బాలోత్సవం - 2025 లో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఒంగోలులో జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో గీతం విద్యార్థులు అభివృద్ధి చేసిన సోలార్ సైకిల్ ప్రదర్శనలో రెండవ బహుమతి గెలుచుకుంది.ఈ విజయం ద్వారా సాంకేతిక వినూత్నతలో గీతం విద్యార్థులు ముందున్నారు అనే విషయాన్ని మరోసారి నిరూపించారు. నూతన తరం విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో గీతం ఎల్లప్పుడూ ముందుంటుందని సంస్థ యాజమాన్యం గర్వంగా ప్రకటించింది.ఈ సోలార్ సైకిల్ ప్రాజెక్టును విజయవంతంగా రూపొందించిన విద్యార్థులు చంద్రమౌళి, కార్తీక్, ఆదిత్య, చేతన్‌లకు గీతం యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపింది.

## సంగటివారి వివాహ వేడుకలో పాల్గొన్న కనిగిరి జెడ్పీటిసి మడతల కస్తూరి రెడ్డి



కనిగిరి రిపోర్టు జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి పట్టణం కొత్తూరులో సంగటి వారి వివాహ వేడుకలో కనిగిరి జెడ్పీటిసి మడతల కస్తూరి రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గం డాక్టర్లు విభాగం అధ్యక్షులు ఆవుల కృష్ణారెడ్డి, నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు సంగటి మహేందర్ రెడ్డి ద్వారశిల శేసిరెడ్డి, మడతల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శారద హైస్కూల్లో విద్యార్థినిలకు ఆత్మ రక్షణ విద్యను ప్రారంభించిన శ్రీ వాణి విద్యాసంస్థల గ్రూప్ అధినేత సనత్ కుమార్



తనకల్లు, మండల రిపోర్టర్. రవీంద్ర (శుభోదయం న్యూస్): శ్రీ శారద విద్యా మందిర్ విద్యార్థినిలకు ఆత్మ రక్షణ, చట్టాల,గురించి అవగాహన సదస్సు నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శారద విద్యాసంస్థ అధినేత సనత్ కుమార్, పాఠశాల డైరెక్టర్ సిద్దరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు ముఖ్య అతిథులు సనత్ కుమార్, శ్రీవాణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అఘాలు అత్యాచారాలు మానభంగాలు నుండి ఆడబిడ్డలను తమకు తమ రక్షించుకోలేనందుకు ఆధ్వర్యంలో ఆత్మరక్షణ విద్య గురించి మరియు మహిళలు-చట్టాలుమహిళల హక్కులు మరియు రాజ్యాంగం ద్వారా కల్పించబడిననివారణలు (చట్టాలు)రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా స్త్రీ పురుషులకుసమానహక్కులు, అవకాశాలు రాజ్యాంగం కల్పిస్తుంది.దేశంలో పౌరుల పట్ల వివక్ష ముఖ్యంగా లింగ వివక్ష నిషేధింప

**బడింది.**

**స్త్రీల గౌరవాన్ని కించపరిచే పని ఏదీ చేయకూడదనేది ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా గుర్తించబడింది.**

**చట్టాలు**

1. లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 (పి.సి.పి. ఎన్.డి.టి.)2. బాల్య వివాహ నిరోధక చట్టం 20063. ఆంధ్రప్రదేశ్ నిర్బంధ వివాహ నమోదు చట్టం 20024. వరకట్న నిషేధ చట్టం 19615. గృహహింస రక్షణ చట్టం 20056. పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు నిషేధ చట్టం వివిధ రకాలైన మహిళలు-చట్టాలుమహిళల హక్కులు గురించి విద్యార్థినిలకు వివరించారు ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ షేక్షావలి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ , పి ఈ టీ నజీర్, ఉపాధ్యాయులు రవీంద్ర, సబిహ, రూబీనా విద్యార్థినిలు పాల్గొన్నారు.

## సమరానికి సిద్ధంగా ఉండండి..



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్న నాయకత్వమే మన ములుగు నియోజకవర్గనికి రక్షపోరాటాలతో త్యాగాలతో తెచ్చుకున్న మన తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందిఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరుగుబాటుకు సై అంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రజానీకంకాంగ్రెస్ పాలనలో కన్నీటి కథలురైతులు ఏడుస్తున్నారురాష్ట్ర ఆడపడుచులు ఏడుస్తున్నారువృద్ధులు ఏడుస్తున్నారు ఆటో డ్రైవర్లు ఏడుస్తున్నారువిద్యార్థులు ఏడుస్తున్నారునిరుద్యోగులు ఏడుస్తున్నారుఉద్యోగస్తులు పదవి విరమణ పొందిన వాళ్లకు డబ్బులు రావడం లేదని ఏడుస్తున్నారు యువకులు,యువతులు ఏడుస్తున్నారుభూముల ధరలు పడిపోయి ఏడుస్తున్నారు తెలంగాణ రాష్టంలో ప్రతీ ఒక్కరు ఏడుస్తున్నారుఏడాది పాలనలోనే ఇంత దారుణంగా కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వంమరో నాలుగేళ్లు మనల్ని పరిపాలిస్తే ఏం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురైతున్న తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం అందుకేతెలంగాణ రాష్ట్ర ప్రజల్లారా కుల మతాలకు ఆతీతంగా కలిసి పోరాడుదాం రాబోయే స్థానిక ఎన్నికల్లో మన బి. ఆర్.ఎస్ పార్టీ సత్తా ఏమిటో చాటి చూపిద్దాం. బి ఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నాయకత్వమే మన ములుగు నియోజకవర్గనికి రక్ష అనిఅన్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరించిన.... నియోజకవర్గగా బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి బడే నాగజ్యోతి



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):ములుగు జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ ములుగు నియోజకవర్గ ఇంఛార్జి బడే నాగజ్యోతి చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు తెలంగాణ జాతిపిత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన సందర్భంగా రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ కోటి వృక్షార్జన గ్రీన్ ఇండియా చాలెంజ్ పోస్టర్ ములుగు జిల్లా కేంద్రంలో ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ ములుగు ఇంచార్జ్ లాంజపెల్లి ప్రవీణ్, ములుగు మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్మి రమేష్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఘరిగా రఘు.వేముల పెల్లి బిక్షపతి.మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య మండల కోఆప్షన్ సభ్యులు ఎండి యూనిస్ సోషల్ మీడియా ఇన్చార్జ్ బొమ్మినేని సురేష్ రెడ్డి, దేవర రాజు, విజయ, పుర్రె స్వరూప కొమరం సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## దశ దిశ కర్మలకు హాజరైన బి ఆర్ ఎస్ నాయకులు



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండలం పి ఏ సి ఎస్ చైర్మన్ తోట రమేష్ చిన్న తాత అయిన తోట సత్యం దశదినకర్మలకు హాజరైన బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు తాటి కృష్ణయ్య మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్ పి ఏ సి ఎస్ డైరెక్టర్లు అచ్చ సత్యనారాయణ, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, కొమరం బాబురావు మండల నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య సుధాకర్ రెడ్డి దంతనపల్లి నరేందర్ తిమ్మంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు ఎగ్గడి అర్జున్ తిమ్మంపేట గ్రామ సోషల్ మీడియా ఇంచార్జ్ పూజారి సతీష్ తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు..

## నల్లవల్లి మేడారం జాతరలో పాల్గొన్న సి జి ఆర్



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): గుమ్మడిదల మండలం నల్లవల్లిలో వెలిసిన శ్రీ మేడాలమ్మ తల్లి జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తదునంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలు తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు సంజీవరెడ్డి, మహిపాల్ రెడ్డి,నల్తూరు యాదగిరి, కిష్టాగౌడ్, నాయకులు సదానంద రెడ్డి, వాసుదేవ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉదయ్ కుమార్, రవీందర్ రెడ్డి, చంద్రారెడ్డి, జయపాల్ రెడ్డి, బిక్షపతి, మండలంలోని గ్రామాల ప్రజలు జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సౌకోట్లు సోమ సూత్రం విరాళంగా అందించిన... కొల్లూరు నర్సింలు ముదిరాజ్



జిన్నారం, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం గా 85000 రూపాయల విలువగల సౌకోట్లు సోమ సూత్రం విరాళంగా అందిస్తున్న కొల్లూరు నర్సింలు ముదిరాజ్ ఆయనకు కమిటీ సభ్యులు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లి అడుగుజాడల్లో నడవాలని ఎల్లప్పుడు అందరికీ తల్లి ఆశీస్సులు ఉంటాయని ప్రతి ఒక్కరూ తమ తోచిన సహాయం చేసి నూతన ఆలయాన్ని నిర్మించుకుందామని జిన్నారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నాకు కూడా అవకాశం ఇచ్చిన జిన్నారం గ్రామ ప్రజలకు నేను కూడా భాగస్వామిని అయినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, జిన్నారం మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ లింగం, బ్రహ్మేందర్ గౌడ్, మంద రమేష్, బండి శ్రీకాంత్ గౌడ్, బ్రహ్మేందర్ ముదిరాజ్, తోట నర్సింగరావు, ఏర్పుల భాస్కర్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజే అబ్దుల్ కలాం క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టుకు కప్పును బహుకరించిన.....

### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): అంతర్గాం మండలం లో ఆదివారం రోజున ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో మొదటి విజేత గా విలేజ్ అంతర్గాం రెండో విజేత రామగుండం రైల్వే టీం గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా విచ్చేసిన రామగుండం




నియోజకవర్గం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొని విజేతకు బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆంగోత్ రవికుమార్ , ట్రస్ట్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం తిలక్ నగర్ హెచ్ఎంఎస్ ఆఫీసులో హాజరైన నాయకులు హెచ్ఎంఎస్, ఐఎఫ్టియు, టి ఎస్ యుఎస్ ,ఏఐఎఫ్టియు,టీ ఐ ఎన్ టి యు సి, నాయకులు , గుర్తింపు గెలిసిన సంఘాల వైఫల్యం సంవత్సరము మూడు నెలలైనా ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. డిస్మిస్లు మొదలైనై , వేధింపులు మొదలైనై, జనరల్ షిఫ్ట్ లో ఫ్రీ మాస్టర్ తీసుకుంటూ ఇంఫార్మర్ గా పని చేసుకుంటూ ఇతర సంఘాల కార్యకర్తలను వేధింపుల కు గురి చేస్తూ బెదిరిస్తూ ఇబ్బంది పెట్టడం జరుగుతుంది. తీర్మానాలు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేయాలి, కార్మికుల పక్షం ఉండాలి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు అండగా నిలబడాలి. అందులో భాగంగా కొత్త బ్లాకులు సింగరేణి కే కేటాయించాలి కొత్త బాబులు ఓపెన్ చేసి పరుగు పందెం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలి , ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ డిస్మిస్ అయిన కార్మికులకు భేషరతుగా ఉద్యోగాలు ఇవ్వాలి, మారుపేర్ల మీద పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలి. రెండు సంవత్సరాలకు తక్కువ సర్వీస్ ఉందన్న కారణం మీద అన్ఫిట్ చేసి ఆనాటి యూనియన్లతో తప్పుడు ఒప్పందం చేసుకొని ఐదు లక్షలన్న నిబంధన తొలగించి ఉద్యోగం ఇవ్వాలి లేకుంటే 25 లక్షలు ఇవ్వాలి, సర్ఫేస్ ఖాళీలను భర్తీ చేయాలై సీనియార్టీ ప్రకారంగా సీనియర్ కార్మికులకు అవకాశం కలపాలి డిప్యూటేషన్ల దందా బంద్ చెయ్యాలి తదితర సమస్యలపై గొల్లేటి నుండి సత్తుపల్లి వరకు బాయ్ బాట 25 నాడు సీఎండీ ని కలవడం డిమాండ్ నోటీసు ఇవ్వడం సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె నోటీస్ ఇవ్వడం రీజన్ వైజ్ గా బహిరంగ సభలు పెట్టి కార్మికులకు వివరించడం ఇవి తీర్మానాలు. హెచ్ ఎం ఎస్ రియాజ్ కన్వీనియర్.

## రామగుండం సండే మార్కెట్ లో చలివేంద్రం ను ప్రారంభించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

### కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓదెల రాజమౌళి సేవాసమితి ఆధ్వర్యంలో

రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) సండే మార్కెట్ లో చిరు




వ్యాపారస్తులని కలుస్తూ మరియు వాడ వాడ తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సండే మార్కెట్ లో లైటింగ్స్ ఏర్పాటు చేయాలనీ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులకు ఆదేశాలు చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ రామగుండం సండే మార్కెట్లో ఆదివారం రోజున ఓదెల రాజమౌళి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్ర కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన గౌరవ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ చలివేంద్రం కేంద్రం అనేది ప్రజల దహాని తీరుస్తాది కుండలో నీరు తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిదని,



వివిధ పనుల మీద ప్రజలు వెళ్తా ఉంటారు చలివేంద్రం కేంద్రం ద్వారా చాలామంది ప్రజల దహాని తీర్చే వాళ్ళం అవుతాం అని అన్నారు, సండే మార్కెట్లో తిరుగుతూ చిరువ్యాపారస్తులను కలుస్తూ మరియు వాడ వాడ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ యువనాయకుడు మాదిరి పృథ్వీరాజ్




పటాన్చెరు, (శుభోదయం న్యూస్): పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ గోశాల వద్ద ఉన్న శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ మాతా దేవాలయం మరియు రామచంద్రపురం కాశిరెడ్డిపల్లి ఫంక్షన్ హాల్‌లో జరిగిన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో బీఆర్ఎస్ యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, బంజారా సామాజికవర్గ




ఆత్మగౌరవానికి ప్రతీకగా సేవాలాల్ మహరాజ్ గారి జీవితం నిలుస్తుందని, ఆయన బోధనలు సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ గారి నిస్వార్థ సేవ, ధర్మబద్ధత, సామాజిక సమానత్వం పట్ల చూపిన అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బంజారా పెద్దలు, యువత, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని, సేవాలాల్ మహరాజ్ గారి సేవలను స్మరించుకున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పటాన్చెరు డివిజన్లో మొదటి ఓటు వేసి గెలిపించగలరని కోరిన గోదావరి అంజిరెడ్డి









పటాన్చెరు, (శుభోదయం న్యూస్): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పఠాన్ చేరు డివిజన్ పరిధిలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ యాజమాన్యంతో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరినా బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సద్గురు సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) గోదావరిఖని గాంధీ నగర్ లో ఫారెస్ట్ డీజీఎం కర్ణ గారి ఆధ్వర్యంలో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆహ్వానం మేరకు సద్గురు సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి 286వ జయంతి ఉత్సవాలకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ మహారాజ్ జయంతిసందర్భంగా పెద్దపల్లి జిల్లాలో రామగుండం నియోజకవర్గం లో అనేక ప్రాంతాల్లో బంజారా కుల బాంధవులు అందరూ కూడా ఘనంగా ఈ యొక్క తీహార్ను చేసుకుంటున్నారు. నేను కూడా వారితోపాటు సింగరేణి వ్యవస్థలో దాదాపుగా 500 మందితో




ఈ జన్మదినా వేడుకలు జరుగుతా ఉన్నాయి.బంజారా కుల బాంధవుల సంక్షేమం కోసం కార్యాలయం ఏర్పాటు చేసుకొని నడిపిస్తున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న యావత్ బంజారా బంధువు మిత్రులకు అందరికీ కూడా సేవలాల్ జన్మదిన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రాంతం బాగుండాలి సుఖ సంతోషాలతో ఉండాలని అభివృద్ధి చెందాలి ఈ రాష్ట్రం బాగుండాలని అదే మాదిరిగా ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు ఆ దేవుడు కల్పించాలని కోరుతూ ఇవాళ బంజారా కుల బాంధవులు అందరు కూడా భారత దేశంలో ఒకప్పుడు వెనుకబడ్డవారు ఈరోజు అత్యున్నత స్థాయిలో చాలా గొప్పగా చదువుకొని




మంచి స్థానాలలో ఉన్నటువంటి స్థాయికి చేరుకున్నటువంటి వాళ్లు కూడా మన బంజారా కుల బాంధవులు ఇంకా ఉన్నంత స్థాయికి ఎదగాలి ఈ సమాజంలో ఎవరైతే బాధ్యత కలిగిన వాళ్లు ఉన్నారో బంజారా కుల బంధువులకు తోడుగాఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో సింగరేణి గిరిజన ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు సీనియర్ నాయకులు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

## ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) గోదావరిఖని లో ఆదివారం రోజున సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని కోరుతూ ఈ రోజు ప్రచారం నిర్వహించడం జరిగింది.ఎన్నికల ముందు కాంగ్రెస్ రేవంత్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 వాగ్దానాలను, 6 గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 20న హైదరాబాదులో నిర్వహించే భారీ నిరసన ప్రదర్శన,సభకు ప్రజలు భారీ ఎత్తున ప్రజలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బి అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదలందరికీ



పక్కాగృహాలు,వ్వాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని,వైద్య సమస్య పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలనిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ ఐ ఎఫ్ టీ యు నాయకులు ఈ నరేష్,ఏ,వెంకన్న,రాధమ్మ,ఎం,లక్ష్మి,పద్మ,గుర్గమ్మ, కృష్ణవేణి, రామ. తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదం సంతోష్ కుమార్...




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధ నగర్ డివిజన్లో జరిగిన విసతృ స్థాయి సమావేశానికి, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జి హెచ్ ఎం సి ఎన్నికల్లో



కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యాచరణ, సికింద్రాబాద్ లో కాంగ్రెస్ పార్టీ పటిష్టత, పార్టీ సంస్థాగత అభివృద్ధి తీసుకోవల్సిన చర్యలు, ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం, పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ, ప్రభుత్వ పదవులు, డివిజన్‌లో వారీగా పార్టీల



కమిటీలు తదితర ముఖ్యమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగిందని అన్నారు. యొక్క కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆదం సృజన్ కుమార్, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యత్వము నిధుల సేకరణ సమావేశం

### రామగుండం నగర యాదవ సంఘం ఆధ్వర్యంలో



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) గోదావరిఖని పట్టణంలో ఆదివారం రోజున రామగుండం నగర యాదవ సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని యాదవ సంఘం భవనములు యాదవ చారిటబుల్ ట్రస్ట్ పెద్దపల్లి జిల్లా సభ్యత్వ నమోదు, నిధుల సేకరణ కార్యక్రమ సమావేశం నిర్వహించడం జరిగింది నగర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి మెండి లింగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, రాష్ట్ర నాయకులు గోపు ఐలయ్య యాదవ్, యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చిలారపు పర్వతాలు యాదవ్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గొడుగు రాజ కొమురయ్య యాదవ్, పాలకుర్తి మండల అధ్యక్షుడు మేకల నర్సయ్య యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులుగా, ట్రస్టీలుగా నమోదు చేసుకోవాలని, భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలకు అందించడమే కాకుండా వేరే ప్రజల ఎడల ఔనత్యాన్ని చూపిస్తూ పేద ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఉచిత వైద్య సౌకర్యాలను కూడా అందించే స్థాయికి ట్రస్ట్ వచ్చిందని కావున రామగుండం నగరంలో ఉన్నటువంటి యాదవులు పెద్ద సంఖ్యలో సభ్యత్వం కావాలని పిలుపునిస్తూ, ప్రస్తుతం అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపునిచ్చి ఈరోజు ఇన్కమ్ టాక్స్ కడుతున్న వారికి ట్రస్ట్ విరాళం వచ్చినట్టు అయితే వారికి వారు కట్టే ట్యాక్స్ లో 50 శాతం రాయితీ ఉంటుందని, దీనిని టాక్సిన్ కట్టే యాదవులందరూ ఉపయోగించుకొని పేద ప్రజలకు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రాజేష్ యాదవ్, గుంపుల తిరుపతి యాదవ్, మేకల కొమురయ్య యాదవ్, ఆర్కే యాదవ్, గోపాలకృష్ణ యాదవ్, రాజ్ కుమార్ యాదవ్, అల్లి కొమురయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పొందిన సందర్భంగా మేకల మల్లేశం యాదవ్, మారం తిరుపతి యాదవ్ లను సంఘ భవనంలో సన్మానించారు.

## శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్న.... కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, శుభోదయం న్యూస్ : 129 డివిజన్ పరధిలోని మెట్టుకానిగూడలో శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి ఆలయం కమిటీ సభ్యులు నిర్వహించిన మల్లన్న జాతరలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ:సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాండు యాదవ్, బాల మల్లేష్, ఆంజనేయులు, శ్రీశైలం యాదవ్, 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు

## మోదీ-ట్రంప్ భేటీ తర్వాతే భారత్‌కు అమెరికా భారీ షాక్!



భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటన అలా ముగించి ఇలా వచ్చారో లేదో.. భారత్‌కు ట్రంప్ భారీ షాకిచ్చారు. భారత్, బంగ్లాదేశ్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు అందించే మిలియన్ డాలర్ల నిధుల్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ శాఖ బాధ్యతలను ప్రపంచ కుబేరుడు ఎలోన్ మస్క్ నిర్వహిస్తున్నారు. ఎలోన్ మస్క్ సూచన మేరకు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని మోదీ గతవారం అమెరికాలో పర్యటించారు. పర్యటన సమయంలో ఇద్దరు నేతలు అమెరికా-భారత్ సంబంధాలను బలోపేతం చేసేలా ముఖ్యమైన ప్రకటనలు చేశారు. ఈ తరుణంలో ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి కేటాయించే 21 మిలియన్ల డాలర్లను, బంగ్లాదేశ్ రాజకీయాల్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 29 మిలియన్ల డాలర్ల మొత్తాన్ని తగ్గించాలని అమెరికా నిర్ణయించినట్లు ఎలోన్ మస్క్ ప్రభుత్వ సామర్థ్య విభాగం డోజ్ ఆదివారం ప్రకటించింది. ఇదే విషయాన్ని డోజ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. కాగా, డొనాల్డ్ ట్రంప్‌ని ప్రధాని మోదీని కలిసిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. మరోవైపు బంగ్లాదేశ్‌లో, రాజకీయ స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ప్రజాస్వామ్య పాలనను మెరుగుపరచడానికి రూపొందించిన కార్యక్రమంలో భాగంగా అమెరికా ఆదేశానికి 29 మిలియన్ డాలర్లను కేటాయిస్తుండేది. తాజాగా ఆ నిధుల కేటాయింపుల్ని ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. హింసాత్మక నిరసనల మధ్య షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సైన్యం గద్దె దించడంతో దేశం రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. హసీనా భారత్‌కు వచ్చిన తర్వాత మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్నప్పటికీ, రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. అమెరికా ప్రభుత్వం తన విదేశాంగ విధాన వ్యూహాల్లో భాగంగా వివిధ దేశాలలో ప్రజాస్వామ్యం, పాలన కార్యక్రమాలకు తరచుగా నిధులు సమకూరుస్తుంది. అలా భారత్‌లో ఓటింగ్ శాతం పెరగడానికి డబ్బు ఖర్చు చేస్తుంది. తద్వారా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటుంది. భారత్‌లాంటి ప్రజాస్వామ్య దేశాల్ని ప్రోత్సహించడం ద్వారా చైనా వంటి దేశాల ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

## అమెరికా నుంచి అమృత్ సర్ కు..
## 116మంది భారత అక్రమ వలసదారుల రాక




అమృత్‌సర్: అమెరికా నుంచి భారత అక్రమ వలసదారులతో కూడిన రెండో విమానం శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండయింది. రాత్రి 10 గంటలకు రావాల్సిన ఈ విమానం ఆలస్యమైంది. ఈ విమానంలో 119 మంది వలసదారులను పంపుతామని అమెరికా అధికారులు ప్రకటించినా, 116 మంది మాత్రం వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో అత్యధికంగా పంజాబ్‌కు చెందిన 65 మంది ఉన్నారు. ఆ తర్వాత హర్యానాకు చెందిన 33 మంది, గుజరాత్ నుంచి 8 మంది, యూపీ, గోవా, మహారాష్ట్ర, రాజస్తాన్‌ల నుంచి ఇద్దరు చొప్పున, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరంతా 18-30 ఏళ్ల మధ్య వారేనని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా నుంచి మొదటి విడతలో ఈ నెల 5న 104 మంది అక్రమ వలసదారులు భారత్‌కు రావడం తెలిసిందే.

## మహాకుంభమేళాపై లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ:మహాకుంభమేళాపై ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహాకుంభమేళాకు అసలేమైనా అర్థం..పర్థం ఉందా..?అది ఓ అర్థం లేని వ్యవహారం' అని లాలూ అన్నారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది దుర్మరణం చెందడం దురదృష్టకరమని వ్యాఖ్యానించే సందర్భంలో లాలూ మహా కుంభమేళాపై ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వేశాఖ విఫలమవడం వల్లే న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందన్నారు. రైల్వే మంత్రి దీనికి పూర్తిగా బాధ్యత వహించాల్సిందేనన్నారు.అయితే మహాకుంభమేళాపై లాలూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నారు. ఈ వ్యాఖ్యలు హిందువులపై ఆర్జేడీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయని బీహార్ బీజేపీ చీఫ్ మనోజ్‌శర్మ అన్నారు. బిహార్ ఎన్నికలు వస్తున్న వేళ ఓ వర్గం వారిని బుజ్జగించేందుకే లాలూ మహాకుంభమేళాను టార్గెట్ చేశారని శర్మ మండిపడ్డారు.

## తొక్కిసలాట జరిగినా ఏమీ మారలేదు..!మళ్లీ గందరగోళమే..



న్యూఢిల్లీ:దేశ రాజధాని న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది మృతి చెందిన తర్వాత కూడా పరిస్థితి మారలేదు. మరుసటి రోజు ఆదివారం(ఫిబ్రవరి16) కూడా రైల్వేస్టేషన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.దీనికి కారణం సీట్ల కోసం ప్రయాణికులు ముందు వెనుకా చూసుకోకుండా మిగిలిన వారిని తోసుకుంటూ వెళ్లి రైళ్లు ఎక్కడమే కారణం. శనివారం సాయంత్రం తొక్కిసలాట జరిగిన చోటుకు దగ్గర్లోనే ప్లాట్‌ఫాం నంబర్ 16 దగ్గర బీహార్ సంపర్క్ క్రాంతి రైలు కోసం ప్రయాణికులు మళ్లీ ఎగబడ్డారు.భారీ లగేజ్ పట్టుకుని ఒకరిని ఒకరు తోసుకుంటూ ఎలాగైనా రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ బీభత్సం సృష్టించారు. ఒక ముసలావిడనైతే ఎమర్జెన్సీ కిటికి నుంచి రైలులోకి నెట్టడానికి ప్రయత్నించగా ఆమె అందులో ఇరుక్కుపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రైలు డోర్ దగ్గర ఆ ముసలావిడ ఎక్కలేని పరిస్థితి ఉండడం వల్లే ఆమెను ఎమర్జెన్సీ కిటికీ నుంచి నెట్టారు.ఇంతేకాకుండా దర్భంగా వెళ్లే రైలు ప్లాట్‌ఫాంపైకి రాగానే రైలులోకి ఎక్కేందుకు రిజర్వేషన్‌లేని, రిజర్వేషన్ కన్ఫామ్ కాని ప్రయాణికులు ఒక్కసారిగా ఎగబడ్డారు. ఎమర్జెన్సీ కిటీకిలో నుంచి లగేజ్‌లను విసురుతూ సీట్లు ముందుగానే ఆపేందుకు ప్రయత్నించారు.ఈ క్రమంలోనే అడ్డొచ్చిన వారిని నెట్టివేయడం గందరగోళానికి దారి తీసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో అక్కడ రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్)కు సంబంధించిన ఒక్క పోలీసు లేకపోవడం న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ఉన్న దారుణమైన పరిస్థితులను అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# కట్టుబడినందుకు కట్టడి చేశారు

### అసోసియేటెడ్ ప్రెస్‌ను బహిష్కరించిన ట్రంప్ !
### అధ్యక్ష భవనం, ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలోకి అనుమతి నిరాకరణ
### 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'అనే పాత పేరుకే కట్టుబడినందుకు ఆగ్రహించిన ప్రభుత్వం




అమెరికాలో దాదాపు వందకు పైగా సంచలనాత్మక కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేసిన డొనాల్డ్ ట్రంప్ అక్కడి అసోసియేటెడ్ ప్రెస్ వార్తాసంస్థపై కత్తిగట్టారు. అమెరికా తీరప్రాంతమైన 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'పేరును 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అయినాసరే పాత పేరునే తమ రోజువారీ వార్తల్లో, కథనాల్లో వినియోగిస్తామని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) కరాఖండీగా చెప్పింది. దీంతో అధ్యక్షుడి నిర్ణయాన్నే బేఖాతరు చేస్తారా అన్న ఆగ్రహంతో ట్రంప్ పాలనాయంత్రాంగం శుక్రవారం నుంచి ఏపీ పాత్రికేయులకు అధ్యక్షభవనం, ఎయిర్‌ఫోర్స్ వన్ అధ్యక్ష విమానంలో రిపోర్టింగ్ కోసం అనుమతి నిరాకరించింది. అన్ని దేశాల్లో దినపత్రికలు, మేగజైన్‌లు, ఇతర వార్తాసంస్థలకు రోజువారీ వార్తలు, కథనాలు అందించే ప్రపంచంలో అతిపెద్ద న్యూస్‌ఏజెన్సీల్లో ఏపీ కూడా ఒకటి. ఇంతటి కీలకమైన బాధ్యతలు నిర్వర్తించే తమ ప్రతినిధులను అధ్యక్షభవనం వంటి ముఖ్యమైన చోటుకు రానివ్వకపోవడంపై 'ఏపీ'తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది వార్తాస్వేచ్ఛను అడ్డుకోవడమేనని వ్యాఖ్యానించింది. దీనిపై ట్రంప్ ప్రభుత్వం స్పందించింది. "అధ్యక్షుని నిర్ణయాన్ని బేఖాతరు చేయడమంటే వార్తల్లో విభజన తెచ్చే సాహసం చేయడమే. పైగా తప్పుడు విషయాన్ని అందరికీ చేరవేయడమే. అధ్యక్షుని నిర్ణయానికి గౌరవం ఇవ్వని వ్యక్తులకు వైట్‌హౌస్‌లో, ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో తగు స్థానం లేదు. ఆ స్థానాన్ని ఇన్నాళ్లూ వైట్‌హౌస్‌లోకి రాలేక రిపోర్టింగ్ చేయలేకపోయినా ఇతర మీడియా ప్రతినిధులకు కల్పిస్తాం"అని వైట్‌హౌస్ డెప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ టేలర్ బుడోవిచ్ వాదించారు. దీనిపై ఏపీ మళ్లీ స్పందించింది. "అమెరికన్ వినియోగదారులను మినహాయిస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా వినియోగదారులకు 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'అనే పేరు వాస్తవం. ఆ దృక్కోణంలో పాత పేరుకే కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో అధ్యక్షుడు కార్యనిర్వాహక ఉత్తర్వును ధిక్కరించినట్లుగా భావించకూడదు"అని ఏపీ స్పష్టంచేసింది.

### దశాబ్దాలుగా పూల్ రిపోర్టర్‌గా..

ప్రముఖ మీడియా సంస్థల కొద్దిపాటి మీడియా ప్రతినిధులు, కెమెరామెన్‌లకు మాత్రమే వైట్‌హౌస్, ఎయిర్‌ఫోర్స్ వన్ వంటి కీలక ప్రదేశాల్లోకి అనుమతిస్తారు. ఇది దశాబ్దాలుగా కొనసాగుతోంది. నాటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ ఏ గార్‌ఫీల్డ్ హత్యోదంతం తర్వాత కొద్దిమంది మీడియా వాళ్లనే అనుమతించడం మొదలెట్టారు. ఇది 1881 ఏడాదినుంచి మొదలైంది. ఈ మీడియా బృంద సభ్యులను పూల్ రిపోర్టర్ అంటారు. 'ఏపీ'ప్రతినిధి చాన్నాళ్లుగా ఇలా పూల్ రిపోర్టర్‌గా కొనసాగుతున్నారు. తమను లోపలికి అనుమతించకపోవడం పూర్తి వివక్షాపూరిత నిర్ణయం అని ఏపీ ప్రతినిధి ఒకరు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేయాలని 'ఏపీ'భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క ఏపీనే బయటకు గెంటేయడంపై వైట్‌హౌస్‌లోని 'ది వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్(డబ్ల్యూహెచ్‌సీఏ)'తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. "ప్రస్తుతానికైతే ఏపీకి బదులు రొటేషన్‌లో భాగంగా వేరే ప్రతినిధికి అవకాశం కల్పిస్తాం. సాధారణంగా ప్రతి రోజూ రొటేషన్‌లో ఏపీకి అవకాశం ఉంటుంది. కానీ ఇలా ఏకపక్షంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లజేస్తూ ప్రభుత్వం సెన్సార్‌షిప్‌కు తెరలేపుతోంది"అని డబ్ల్యూహెచ్‌సీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

# ఆఫ్రికాను చీలుస్తూ... ఆరో మహాసముద్రం

### శరవేగంగా పుట్టుకొస్తోంది
### టెక్టానిక్ ప్లేట్ల కదలికలే కారణం
### విడిపోనున్న ఆఫ్రికా తూర్పు ప్రాంతం
### నడుమ ఖాళీలోకి అపార జలరాశి
### పలు దేశాలకు కొత్తగా తీర రేఖలు



మహాసముద్రాలు ఐదు అని చిన్నప్పుడు చదువుకున్నాం. కానీ ఆరు అని మార్చుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఆఫ్రికా ఖండాన్ని రెండుగా చీలుస్తూ శరవేగంగా ఆరో మహాసముద్రం పుట్టుకొస్తోంది. ఆ క్రమంలో అక్కడి పలు దేశాలను ఆఫ్రికా నుంచి విడదీయనుంది. మరికొన్నింటిని కొత్తగా సముద్ర తీర దేశాలుగా మార్చేయనుంది. ఆఫ్రికా దిగువన జరుగుతున్న టెక్టానిక్ ప్లేట్ల కదలికల వల్ల ఇది తప్పదన్నది తెలిసిన విషయమే అయినా, అందుకు కోట్లాది ఏళ్లు పట్టవచ్చని ఇప్పటిదాకా భావించారు. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే ఆరో మహాసముద్రం ఆవిర్భావానికి మహా అయితే కొన్ని వేల ఏళ్ల కంటే ఎక్కువ సమయం పట్టకపోవచ్చని పరిశోధకులు బల్ల గుద్ది చెబుతున్నారు! టెక్టానిక్ ఫలకాల కదలికల కారణంగా ఆఫ్రికా ఖండం నిలువునా చీలిపోతోంది. వేలాది ఏళ్లుగా స్థిరంగా జరుగుతూ వస్తున్న ఈ పరిణామం కొంతకాలంగా అనూహ్య రీతిలో వేగం పుంజుకుంది. ఆఫ్రికా ఖండం దిగువన నుబియన్, సోమాలీ, ఖండాంతర టెక్టానిక్ ప్లేట్లలో జరుగుతున్న కదలికలే దీనికి ప్రధాన కారణం. అవి ఏటా ఏకంగా దాదాపు ఒక సెంటీమీటర్ మేరకు దూరం జరుగుతున్నాయి! ఈస్ట్ ఆఫ్రికన్ రిఫ్ట్ సిస్టం (ఈఏఆర్ఎస్)గా పిలిచే ఈ ప్రాంతం ఇది మొజాంబిక్ నుంచి ఇథియోపియా, కెన్యా, టాంజానియా మీదుగా ఎర్రసముద్రం దాకా వేలాది కిలోమీటర్ల మేర విస్తరించింది. దాని పొడవునా భూగర్భంలో వేలాది ఏళ్లుగా అతి నెమ్మదిగా సాగుతూ వస్తున్న నిరంతర టెక్టానిక్ కదలికల పరిణామం కొన్నాళ్లుగా స్పీడందుకుంది. తూర్పు ఆఫ్రికాను నిలువునా చీలుస్తోంది. ఫలితంగా చివరికి తూర్పు ఆఫ్రికా క్రమంగా మిగతా ఖండం నుంచి పూర్తిగా విడిపోనుంది. వాటి మధ్య ఏర్పడే ఖాళీలో ఏకంగా 10 వేల బిలియన్ గ్యాలన్ల పై చిలుకు అపార జలరాశి నిండిపోయి సరికొత్త మహాసముద్రంగా రూపుదిద్దుకోనుంది. ఇందుకు సంబంధించిన నిదర్శనాలు ఇప్పటికే కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఇథియోపియాలో 2005 నాటికే ఏకంగా 60 మైళ్ల పొడవున లోతైన గుంత ఏర్పడింది. ఇది పలుచోట్ల ఏకంగా 20 మీటర్ల పై చిలుకు లోతుంది! 2018లో కెన్యాలో కూడా ఇలాంటి భారీ పగుళ్లు పుట్టుకొచ్చాయి.

కారణాలెన్నో...

టెక్టానిక్ కదలికలతో పాటు భూమి లోపలి పొరల్లోని శిలాజ ద్రవం తూర్పు ఆఫ్రికా చీలికను మరింత వేగవంతం చేస్తోంది. క్రమంగా లోపలి పొర పూర్తిగా పగుల్లిచ్చి భారీ లోయల పుట్టుకకు దారితీస్తుంది. అగ్నిప్రమాద కార్యకలాపాలను పెంచుతుంది. 2005లో ఇథియోపియాలో కేవలం కొన్ని వారాల వ్యవధిలోనే ఏకంగా 420కి పైగా భూకంపాలు నమోదయ్యాయి. ఈ పరిణామం సైంటిస్టులతో పాటు పరిశోధకులను కూడా ఎంతగానో ఆశ్చర్యపరిచింది. ఆఫ్రికా ఖండం దిగువ భూ ఫలకాల్లో మార్పులు శరవేగంగా జరుగుతున్నాయనేందుకు ఇది తిరుగులేని నిదర్శనమని వారంటున్నారు. ఇకపై ఆఫ్రికాలో మరిన్ని భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్ల వంటి పరిణామాలను చూడనున్నామని తులానే వర్సిటీ జియో సైంటిస్టు సింథియా ఎబింగర్ చెప్పుకొచ్చారు.

అట్లాంటిక్ ఇలాగే పుట్టింది...

మహాసముద్రాల్లో వయసురీత్యా అట్లాంటిక్ అన్నింటికంటే చిన్నది. ప్రస్తుత ఆఫ్రికా ఖండం తరహా పగుళ్లే లక్షలాది ఏళ్ల క్రితం దాని పుట్టుకకు దారితీసినట్టు సైంటిస్టులు చెబుతారు. తర్వాత మళ్లీ ఇంతకాలానికి మరో మహాసముద్రం పుట్టుకకు దారి తీయగల స్థాయిలో ఓ ఖండం నిలువునా చీలుతోంది. మహాసముద్రాల ఆవిర్భావ క్రమాన్ని అర్థం చేసుకునేందుకు ఇది చాలా అరుదైన అవకాశమని సైంటిస్టులు అంటున్నారు.

కొత్త ఖండం కూడా...

ఆఫ్రికా చీలిక ఆరో మహాసముద్రంతో పాటు కొత్త ఖండం పుట్టుకకు కూడా దారితీయనుంది. ఎందుకంటే సోమాలియా, కెన్యా, టాంజానియా వంటి దేశాలు ఆఫ్రికా నుంచి పూర్తిగా విడిపోతాయి. ఆరో సముద్రం ఆ మధ్యలో విస్తరిస్తుంది.

లక్షల్లో నిర్వాసితులు...

వాతావరణ మార్పుల దెబ్బకు ఆఫ్రికా ఖండంలో ఇప్పటికే 1.5 కోట్ల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఆ ఖండంలో ఏర్పడుతున్న చీలిక వల్ల పలు దేశాల్లో జీవజాలం తీవ్రంగా ప్రభావితం అవుతుంది. దాంతో మొత్తంగా వాటి ఆర్థిక పరిస్థితులే తారుమారు కానున్నాయి. దాంతో పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లే వారి సంఖ్య ఊహాతీతంగా పెరిగిపోనుంది. కొత్త మహాసముద్రం ఆఫ్రికా భౌగోళిక స్వరూపాన్నే సమూలంగా మార్చనుంది. పలు దేశాల ఆర్థిక, పర్యావరణ, మౌలిక వ్యవస్థలనే తలకిందులు చేయనుంది. చుట్టూ భూభాగాలతో కూడిన జాంబియా, ఉగాండా వంటి దేశాలు కొత్త సముద్ర తీర ప్రాంతాలు మారిపోతాయి. దాంతో కొత్త వర్తక మార్గాలు, ఆ దేశాల్లో నౌకాశ్రయాల వంటివి పుట్టుకొస్తాయి. అలా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలే సమూలంగా మారిపోతాయి. సరికొత్త సముద్ర వాతావరణ పరిస్థితులు కొత్త ఆవాస ప్రాంతాలుగా మారతాయి. ఈ పరిణామం జీవవైవిధ్యంలో చెప్పుకోదగ్గ మార్పులకు దారి తీస్తుంది. అదే సమయంలో సముద్రమట్టంలో పెరుగుదల మరింత వేగంపుంజుకుంటుంది. భూభాగాల్లో మార్పుచేర్పులు చోటుచేసుకుంటాయి. అంతేగాక పలుచోట్ల తరచుగా తీవ్ర భూకంపాలు సంభవించవచ్చు. ఇలాంటి పరిణామాల వల్ల వచ్చిపడే తీవ్రమైన రిస్కులను ఎదుర్కొనేందుకు పలు దేశాలు ఇప్పటినుంచే సిద్ధపడాల్సి ఉంటుంది. కొత్త మహాసముద్రం ఆవిర్భావం వేలాది ఏళ్ల తర్వాత జరిగినా ఆ క్రమంలో తలెత్తే పరిణామాలు ఆఫ్రికా ఖండంపై సమీప భవిష్యత్తు నుంచే కొట్టొచ్చినట్టుగా కన్పించడం మొదలవుతుంది. భూగోళం నిరంతరం పరిణామం చెందుతున్న తీరుకు ఈ పరిణామం మరో తాజా ఉదాహరణ. దీని ప్రభావాలను పూర్తిగా అర్థం చేసుకునే ప్రయత్నంలో భూభౌతిక శాస్త్రవేత్తలు ఇప్పటికే తలమునకలయ్యారు. ఎందుకంటే తూర్పు ఆఫ్రికాలో జరుగుతున్నది కేవలం భౌగోళికపరమైన మార్పు మాత్రమే కాదు. సుదూర భవిష్యత్తులో మరిన్ని ఖండాలు విడిపోయి కొత్త మహాసముద్రాల పుట్టుక వంటివి జరిగి చివరికి మనకిప్పుడు తెలిసిన ప్రపంచమే సమూలంగా, శాశ్వతంగా మారిపోతుందనడానికి తిరుగులేని నిదర్శనం. ఆరో మహాసముద్రం ఆవిర్భావంతో ప్రపంచ భౌగోళిక స్వరూపంతో పాటు పర్యావరణ వ్యవస్థలు కూడా సమూల మార్పులకు లోనవడం ఖాయమని భూచితిక శాస్త్రవేత్తలు కుండబద్దలు కొడుతున్నారు.

# శ్వేతసౌధంలో ట్రంప్ మగ్‌షాట్

### అరెస్టునాటి ఫొటోనే
### ఫ్రేమ్ కట్టి మరీ
### వైట్‌హౌస్‌లో
### తగిలించుకున్న వైనం

ఏదైనా కేసులో ఒక నేత అరెస్ట్ అయితే ఆ విషయాన్ని పత్రికా సమావేశంలోనో, మరే సందర్భంలోనో ప్రస్తావిస్తే ఆ నేతకు అస్సలు నచ్చదు. అసలు తనను అన్యాయంగా అరెస్ట్ చేశారని అంతెత్తున లేచి ఖండిస్తారు. అరెస్ట్‌నాటి ఫొటోలను ఒకవేళ మళ్లీ ఆయన ముందే పెడితే ఉగ్రరూపం దాల్చినా ఆశ్చర్య పోనక్కర్లేదు. అలాంటిది తెంపరితనానికి మారుపేరుగా నిలిచిపోయిన అగ్రరాజ్యానికి అధినేత డొనాల్డ్ ట్రంప్ ఇంకెలా స్పందిస్తారో అని చాలా మంది భావించడం సహజం. కానీ అలాంటి ఆలోచనలకు పటాపంచలు చేస్తూ, విభిన్నంగా ట్రంప్ తన అరెస్ట్ నాటి ఫొటోను పెద్ద సైజులో తీయించి చక్కగా బంగారు రంగు ఫ్రేమ్ కట్టి ఏకంగా అధ్యక్షభవనంలోనే తగిలించారు. అది కూడా ఎక్కడో కనిపించనట్లు ఓ మూలన కాకుండా నేరుగా కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేసే ఓవల్ ఆఫీస్ గోడకే తగిలించారు. రెండ్రోజుల క్రితం అమెరికా పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీ వైట్‌హౌస్‌కు వెళ్లినప్పుడు అక్కడి మీడియా కెమెరామెన్‌లు ఓవల్ ఆఫీస్ అంతటినీ తమ కెమెరాల్లో బంధించిన వేళ ఈ మగ్‌షాట్ ఫొటోఫ్రేమ్ విషయం వెలుగులోకి వచ్చింది.



ఏమిటీ మగ్‌షాట్ ?

2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి జార్జియా రాష్ట్రంలో ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై నాటి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌ను అరెస్ట్‌చేశారు. ఆ సందర్భంగా 2023 ఆగస్ట్‌లో జార్జియా రాష్ట్రంలోని ఫుల్టన్ కౌంటీ జైలుకు వచ్చి ట్రంప్ లొంగిపోయారు. కస్టడీలోకి తీసుకునే ముందు అరెస్ట్ అయిన నిందితుడి ముఖం స్పష్టంగా తెలిసేలా దగ్గరి ఫొటో అంటే మగ్ షాట్‌ను నిబంధనల ప్రకారం తీసుకుంటారు. ట్రంప్ ఫొటో సైతం అలాగే తీశారు. మాజీ అధ్యక్షుడిని ఇలా మగ్‌షాట్ తీయడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో ట్రంప్ మగ్‌షాట్ ఆన్‌లైన్‌లో విపరీతంగా వైరల్ అయింది. ఆ ఫొటోను ఆనాడు ప్రఖ్యాత న్యూయార్క్ పోస్ట్ సైతం ఫ్రంట్‌పేజీలో ప్రచురించింది. ఆ ఫ్రంట్‌పేజీ కటౌట్‌నే ట్రంప్ ఫ్రేమ్ కట్టించారు. మగ్‌షాట్‌పై నాటి అధికార డెమొక్రాట్లు, నాటి అధ్యక్షుడు జో బైడెన్ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. అయితే ట్రంప్‌కు మద్దతుగా ఇదే మగ్‌షాట్ ఫొటోలను ఆన్‌లైన్‌లో ప్రచారానికి రిపబ్లికన్ నేతలు వాడుకున్నారు. తాజాగా మగ్‌షాట్‌ను వైట్‌హౌస్‌లో ఫ్రేమ్ కట్టిన విషయం అందరికీ తెలియడంతో వైట్‌హౌస్ డెప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డాన్ స్కావినో ఒక పోస్ట్‌చేశారు. "హ్యాపీ వేలంటైన్ డే. అందమైన ఓవల్ ఆఫీస్‌లోకి మీకందరికీ స్వాగతం"అని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ఈ ఫొటోఫ్రేమ్‌ను మాజీ అమెరికా అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్, ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌ల ఫొటోల సమీపంలో తగిలించారు. ఆనాడు అరెస్ట్ అయిన వెంటనే పూచీకత్తు మీద ట్రంప్ విడుదలయ్యారు. ఎలాగూ ఫొటో వైరల్‌గా మారడంతో దీనిని వ్యాపారవస్తువుగా ట్రంప్ మార్చేశారు. స్వయంగా ఆయన తన మగ్‌షాట్ ఫొటోల విక్రయం ద్వారా దాదాపు రూ.61 కోట్లు ఆర్జించారు. టీ-షర్ట్‌లు మొదలు డిజిటల్ ట్రేడింగ్ కార్డుల దాకా అన్నింటిపైనా ఈ మగ్‌షాట్‌నే ముద్రించారు.

# రాహుల్ పై 'గంభీర్' నమ్మకం.. ఛాంపియన్స్ ట్రోఫీలో మెరుస్తాడా?

ఆస్ట్రేలియా పర్యటన లో ఘోర వైఫల్యం తర్వాత భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ లో కొన్ని కీలకమైన మార్పులు చేసాడు. ఛాంపియన్స్ ట్రోఫీ కి ముందు ఇంగ్లండ్ తో జరిగిన సిరీస్ లో ఇందుకోసం తన ఫార్ములా ని పరీక్షించేందుకు ఉపయోగించుకున్నాడు.భారత్ జట్టులోని కీలక బ్యాటర్ కూడా సొంత గడ్డపై మళ్ళీ తమ మునుపటి ఫామ్ ని అందుకున్నారు. ప్రతిష్టాత్మకమైన ఛాంపియన్స్ ట్రోఫీ కి జట్టులోని ప్రధానబ్యాటర్లు అందరూ మానసికంగా సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తున్నారు. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఓపెనర్ శుభమన్ గిల్, మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు పరుగులు సాధించి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు.

### రాహుల్ వైపే గంభీర్ మొగ్గు..

అయితే గంభీర్ తీసుకొచ్చిన మరో పెద్ద మార్పు. రిషబ్ పంత్ స్థానంలో భారత్ నెంబర్ 1 వికెట్ కీపర్ గా కె ఎల్ రాహుల్ ని ఎంచుకోవడం. రాహుల్ కి పంత్ కి చాలా వ్యత్యాసం ఉంది. ఇద్దరి బ్యాటింగ్ విధానంలో చాలా తేడా ఉంది. పంత్ భారీ షాట్లతో కొద్దిసేపటి లోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చే సత్తా ఉన్నవాడు. రాహుల్ అందుకు భిన్నంగా ఆచి తూచి ఆడతాడు. క్రీజులో నిలదొక్కుకోవడానికి సమయం తీసుకుంటాడు. టెక్నికల్ గా రాహుల్ సమర్థుడైన బ్యాటర్ అయినప్పటికీ, అతను స్వతహాగా ఆచి తూచి ఆడే స్వభావం గల బ్యాటర్. ఇక్కడ మ్యాచ్ లో పరిస్థితులని బట్టి వీరిద్దరినీ ఉపయోగించుకోవాలి. టాప్ ఆర్డర్ బ్యాటర్ బాగా రాణించి స్కోర్ బాగా చేసినట్టయితే,అలాంటి పరిస్థితుల్లో శరవేగంగా మరిన్ని పరుగులు సాధించడానికి పంత్ సరిగ్గా సరిపోతాడు. అయితే పంత్ బ్యాటింగ్ శైలి వల్ల అతను నిలకడ రాణించగలడన్న గ్యారెంటీ లేదు. కానీ రాహుల్ అందుకు భిన్నంగా, క్రీజులో నిలదొక్కుకుంటే తనదైన శైలిలో నేర్పుగా పరుగులు రాబట్టగలడు. ఇంత వైరుధ్యం గల ఇద్దరు వికెట్ కీపర్లలలో ఒకరిని ఎంచుకోవడం సామాన్య విషయం కాదు. ఎందుకంటే ఇద్దరూ వ్యక్తిగతంగా ఎంతో సామర్థ్యం గల బ్యాట్స్మన్. ఇలాంటి క్లిష్టమైన విషయంలో కోచ్ గంభీర్ తన ప్రధాన వికెట్ కీపర్ గా రాహుల్ నే ఎంచుకోవడం. ఎందుకంటె రాహుల్ చాల నిలకడైన బ్యాటర్ కావడమే. రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్అయితే ఈ నిర్ణయం చాల మందికి రుచించలేదు. ఇక్కడ మరో విషయం ఉంది. అది రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్. రాహుల్ సాధారణంగా టాప్ ఆర్డర్ లో బ్యాటింగ్ కి వస్తాడు. కానీ ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ లోని తొలి రెండు వన్డేల్లో రాహుల్ ఆరో నెంబర్ బ్యాట్స్మన్ గా రంగంలోకి వచ్చాడు. "ప్రస్తుతానికి, కెఎల్ మాకు నంబర్ 1 వికెట్ కీపర్. ప్రస్తుతానికి అతను జట్టు తరపున అద్భుతంగా రాణిస్తున్నాడు" అని గంభీర్ అహ్మదాబాద్ మ్యాచ్ అనంతరం వ్యాఖ్యానించాడు. "జట్టులో ఇద్దరు వికెట్ కీపర్లు ఉన్నప్పుడు, ఇద్దరు వికెట్ కీపర్లను ఆడించడం సాధ్యం కాదు. భారత్ జట్టులోని ఇతర బ్యాట్స్మన్ నైపుణ్యం, వారి అపార అనుభవం దృష్ట్యా చూస్తే, ఇది సాధ్యమయ్యే విషయం కాదు. ఇక పంత్ విషయానికి వస్తే అతను అవకాశం వచ్చినప్పుడు ఆడటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రస్తుతానికి నేను ఈ విషయం గురించి అంతే చెప్పగలను,," అని గంభీర్ తన నిర్ణయాన్ని తేటతెల్లం చేసాడు. ఎడమచేతి వాటం బౌలర్ అక్షర్ పటేల్ను ఐదో స్థానంలో బ్యాటింగ్ కి బ్యాటింగ్ కి పంపించాలన్న గంభీర్ తీసుకున్న నిర్ణయం కూడా చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫలితంగా, మొదటి రెండు మ్యాచ్‌లలో రాహుల్ ప్రదర్శన నిరాశపరిచింది - మొదటి రెండు మ్యాచ్‌లలో రాహుల్లో కేవలం రెండు, పది పరుగులు మాత్రమే చేసాడు. చేసాడు. అయితే మూడో మ్యాచ్ లో రాహుల్ తనకి అనుకూలంగా ఉండే ఐదో స్థానంలో బ్యాటింగ్ కి వచ్చి 29 బంతుల్లో 40 పరుగులు చేశాడు."రాహుల్‌ను ఆరో స్థానంలో బ్యాటింగ్ కి పంపించి అతనిని వృధా చేస్తున్నారు," అని భారత మాజీ స్టంపర్ పార్థివ్ పటేల్ వ్యాఖ్యానించాడు. రికార్డులను చూడనని చెబుతూ గంభీర్ అలాంటి సూచనలను తోసిపుచ్చాడు. దుబాయ్‌లో రాహుల్ ఆరవ స్థానంలో కొనసాగాల్సి రావచ్చని కూడా గంభీర్ స్పష్టం చేశాడు.

### రాహుల్ ప్రపంచ కప్ రికార్డ్

2023 ప్రపంచ కప్ కి ముందు పంత్ గాయపడ్డాడు. ఆ దశలో రాహుల్ భారత్ జట్టు కి అండగా నిలిచి రాణించాడు. రాహుల్ ఐదో స్థానంలో బ్యాటింగ్ కి వచ్చి 75.33 సగటుతో 452 పరుగులు చేశాడు భారత్ ఫైనల్ కి చేర్చడంలో కీలక భూమిక పోషించాడు.

పైగా రాహుల్ భారత్ మిడిల్ ఆర్డర్ను పటిష్టంగా ఉంచాడు. ప్రస్తుతం కోచ్ గంభీర్ కూడా రాహుల్ నుంచి అదే ఆశిస్తున్నాడు. వికెట్ కీపింగ్ బాధ్యతలతో పాటు మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ ని కూడా పటిష్టంగా ఉంచి జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ సాధించడంలో తోడ్పడుతాడని భావిస్తున్నాడు. మరి గంభీర్ వ్యూహం ఫలిస్తుందేమో చూడాలి.

# స్పోర్ట్స్ న్యూస్






# ఛాంపియన్స్ ట్రోఫీ..
# చరిత్రకు అడుగు దూరంలో విరాట్ ?కోహ్లీ

స్వదేశంలో ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ను క్వీన్ స్వీప్ చేసిన టీమిండియా.. ఇప్పుడు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీపై కన్నేసింది. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ కోసం భారత జట్టు శనివారం దుబాయ్‌కు పయనమైంది. ఈ మెగా ఈవెంట్ పాకిస్తాన్, యూఏఈ వేదికలగా హైబ్రిడ్ మోడల్‌లో జరగనుంది. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఈ టోర్నీలో రన్నరప్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా.. ఈసారి ఎలాగైనా ఛాంపియన్స్‌గా తిరిగిరావాలని పట్టుదలతో ఉంది. ఈ మినీ వరల్డ్‌కప్‌లో భారత్ తమ తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 19న దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

### సచిన్ రికార్డుపై విరాట్ కన్ను..

కాగా ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి ని ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. బంగ్లాతో మ్యాచ్‌లో కోహ్లి మరో 37 పరుగులు చేస్తే.. వన్డేల్లో అత్యంతవేగంగా 14,000 పరుగుల మైలురాయిని అందుకున్న ఆటగాడిగా విరాట్ చరిత్ర సృష్టిస్తాడు. ప్రస్తుతం ఈ రికార్డు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. సచిన్ తన 350వ వన్డే ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్‌పై ఈ ఫీట్‌ను అందుకున్నాడు. కోహ్లి ఇప్పటివరకు 285 ఇన్నింగ్స్‌లలో 13963 పరుగులు చేశాడు. సచిన్ తర్వాతి స్థానంలో శ్రీలంక లెజెండ్ కుమార్ సంగక్కర ఉన్నాడు. సంగ్కర 378 ఇన్నింగ్స్‌లలో 14,000 పరుగుల మైలు రాయిని సాధించాడు. ఈ క్రమంలో తొలి మ్యాచ్‌లో ఈ దిగ్గజాలను కోహ్లి అధిగమించే అవకాశముంది.అంతేకాకుండా ఈ టోర్నీలో విరాట్ మరో 173 పరుగులు సాధిస్తే.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా శిఖర్ ధావన్? రికార్డు కూడా బద్దలు అయ్యే ఛాన్స్ ఉంది. దావన్ ఛాంపియన్స్ ట్రోఫీలో 10 మ్యాచ్‌లు ఆడి 701 పరుగులు చేశాడు. కోహ్లి విషయానికి వస్తే.. 13 మ్యాచ్‌ల్లో 529 పరుగులు చేశాడు. అదేవిధంగా కోహ్లి మరో 263 పరుగులు చేయగలిగితే ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా వరల్డ్ రికార్డు సృష్టించే అవకాశముంటుంది. ప్రస్తుతం ఈ రికార్డు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. గిల్ 791 పరుగులతో ఈ టోర్నీలో టాప్ రన్‌స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. కాగా ఇంగ్లండ్‌తో జరిగిన ఆఖరి వన్డేలో కోహ్లి హాఫ్ సెంచరీ సాధించి తన ఫామ్‌ను తిరిగి అందుకున్నాడు. అదేజోరును ఈ ఐసీసీ ఈవెంట్‌లోనూ కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# రోహిత్ శర్మ ఇంకో 183 పరుగులు చేస్తే...

ఇంగ్లండ్‌తో స్వదేశంలో వన్డే సిరీస్ ను ఘనంగా ముగించిన టీమిండియా తదుపరి చాంపియన్స్ ట్రోఫీ-2025 తో బిజీ కానుంది. బట్లర్ బృందాన్ని 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన రోహిత్ సేన.. ఆత్మవిశ్వాసంతో ఈ ఐసీసీ టోర్నమెంట్లో అడుగుపెట్టనుంది.

ఇక ఫిబ్రవరి 19 నుంచి పాకిస్తాన్ వేదికగా ఈ మెగా ఈవెంట్ ఆరంభం కానుండగా.. టీమిండియా మాత్రం తమ మ్యాచ్‌లన్నీ తటస్థ వేదికైన దుబాయ్‌లో ఆడనుంది. లీగ్ దశలో భాగంగా తొలుత బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న.. అనంతరం ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో.. ఆ తర్వాత మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత జట్టు తలపడనుంది.

### అరుదైన రికార్డు ముంగిట హిట్‌మ్యాన్

ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ను ఓ ప్రపంచ రికార్డు ఊరిస్తోంది. దుబాయ్‌లో చరిత్ర సృష్టించేందుకు హిట్‌మ్యాన్ ఇంకా 183 పరుగుల దూరంలో ఉన్నాడు. కాగా గత కొంతకాలంగా పేలవ ఫామ్‌తో సతమతమైన రోహిత్ శర్మ ఇంగ్లండ్‌తో రెండో వన్డే సందర్భంగా వింటేజ్ హిట్‌మ్యాన్‌ను గుర్తు చేశాడు. డెబ్బై ఆరు బంతుల్లోనే వంద పరుగుల మార్కు అందుకున్న రోహిత్ శర్మ... తన వన్డే కెరీర్‌లోనే రెండో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. కటక్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో మొత్తంగా పన్నెండు ఫోర్లు, ఏడు సిక్స్‌ల సాయంతో 119 పరుగులు చేశాడు. అయితే, తదుపరి మ్యాచ్‌లో మాత్రం పేసర్ మార్క్ వుడ్ సంధించిన సూపర్ డెలివరీని ఆడలేక.. మళ్లీ విఫలమై ఒక్క పరుగుకే పెవిలియన్ చేరాడు.

### ఇంకో 183 పరుగులు జతచేశాడంటే

ఇక తదుపరి రోహిత్ శర్మ దుబాయ్ వేదికగా ఐసీసీ వన్డే టోర్నీ చాంపియన్స్ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. కాగా దుబాయ్‌లో ఇప్పటి వరకు అతడు వన్డేల్లో 317 పరుగులు సాధించాడు. ఈ ఈవెంట్ సందర్భంగా ఇందుకు ఇంకో 183 పరుగులు జతచేశాడంటే.. దుబాయ్‌లో అత్యధిక వన్డే పరుగులు సాధించిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ చరిత్రకెక్కుతాడు. ప్రస్తుతం ఈ ?ప్రపంచ రికార్డు స్కాట్లాండ్‌కు చెందిన రిచీ బెరింగ్‌టన్ పేరిట ఉంది. అతడు ఇప్పటి వరకు దుబాయ్‌లో వన్డేల్లో 424 పరుగులు సాధించాడు. టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ 342 పరుగులతో భారత బ్యాటర్లలో టాప్‌లో కొనసాగుతున్నాడు. కాగా వన్డేల్లో ఇప్పటి వరకు ఎవరికీ సాధ్యం కాని రీతిలో రోహిత్ శర్మ మూడు డబుల్ సెంచరీలు సాధించాడు. వన్డేల్లో అతడి అత్యధిక స్కోరు 264. ఇక మొత్తంగా ఇప్పటి వరకు టీమిండియా తరఫున 260 వన్డేలు పూర్తి చేసుకుని 10988 పరుగులు సాధించాడు. అతడి ఖాతాలో 338 వన్డే సిక్సర్లు ఉన్నాయి.

### చాంపియన్స్ ట్రోఫీ-2025కి టీమిండియా

రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి.

# 'అతడొక సూపర్ స్టార్.. దుబాయ్‌లో దుమ్ములేపుతాడు'



టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ తన రీఎంట్రీలో సత్తాచాట లేకపోతున్నాడు. దాదాపు ఏడాది తర్వాత గాయం నుంచి కోలుకుని అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన షమీ తన మార్క్ చూపించలేకపోతున్నాడు. తన రిథమ్‌ను తిరిగి పొందడానికి ఈ బెంగాల్ స్టార్ సీమర్ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లో షమీ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయ లేకపోయాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ రూపంలో షమీ మరో సవాలు ఎదురు కానుంది. ఈ టోర్నీకి పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా దూరం కావడంతో భారత ఫాస్ట్ బౌలింగ్ ఎటాక్‌కు షమీనే నాయకత్వం వహించాలి. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్యాతో కూడా పేస్ త్రయాన్ని ముందుకు నడిపించాల్సిన బాధ్యత షమీపైనే ఉంది. అయితే షమీ తన రిథమ్‌ను అందుకుంటే అపడం ఎవరి తరం కాదు. ఇప్పటికే 2023 వన్డే వరల్డ్‌కప్‌లో తనంటో ఈ స్పీడ్ స్టార్ నిరూపించుకున్నాడు. ఈ నేపథ్యంలో షమీపై భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ రాబిన్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో షమీ దుమ్ములేపుతాడని రాబిన్‌సింగ్ జోస్యం చెప్పాడు. కాగా రాబిన్ సింగ్ ప్రస్తుతం ఇంటర్ననేషనల్ టీ20 లీగ్‌లో ఎంఐ ఎమిరేట్స్ ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. దీంతో దుబాయ్ స్టేడియంలో పిచ్ ఎలా ఉం టుందో అతడికి బాగా తెలుసు. ఈ క్రమంలోనే దుబాయ్ వికెట్ షమీకి సరిగ్గా సెట్ అవుతాందని రాబిన్ సింగ్ అంచనా వేశాడు."దుబాయ్ వికెట్‌పై రాత్రి పూట బౌలింగ్ చేయడం కొంచెం కష్టమనే చెప్పాలి. మంచు కారణంగా బంతి బౌలర్ల చేతి నుంచి జారిపోయే అవకాశముంది. అయితే ప్రస్తుతం ఇక్కడ మంచు విస్తృతంగా లేదు. ఈ వికెట్‌పై రాత్రిపూట బ్యాటింగ్ చేయడానికి అనుకూలంగా ఉంటుంది. పరుగులు సునాయసంగా రాబట్టవచ్చు. కానీ ఈ పరిస్థితులను మంచి సీమ్ బౌలర్ అయితే తనకు తగ్గట్టు మలుచుకుంటాడు. షమీలాంటి స్పీడ్ స్టార్‌కు ఈ వికెట్ సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే సరైన లెంగ్త్‌తో పాటు గుడ్ ఏరియాలలో అతడు హిట్ చేస్తాడు. షమీ పర్ఫెక్ట్ సీమ్ పొజిషన్ కలిగి ఉన్నాడని" ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాబిన్ సింగ్ పేర్కొన్నాడు. కాగా ఈ మెగా టోర్నీలో భారత్ తమ తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 20న దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

ఛాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, షమీ, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి